ఎవరిగోల వారికి ఆనందం అంటారు. దేశంలో వివిధ వ్యాధులతో కోట్లాది మంది ప్రజలు విలవిల్లాడుతుంటే అటు కేంద్రప్రభుత్వం,ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయ క్రీడలో మునిగితేలుతుండడం దురదృష్టకరం. కేంద్ర ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేందుకు కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, వాటిని ఇరుకున పెట్టేందుకు కేంద్రప్రభుత్వం ఆడుతున్న జగన్నాటకంలో సామాన్యులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. దేశంలో డెంగ్యూ, చికెన్‌గున్యా, స్వైన్ ఫ్లూ లాంటి విషజ్వరాలతోపాటు మలేరియా, డయేరియా ఒక్కటేమిటి అన్నిరకాల వ్యాధులు ప్రజారోగ్యంపై దాడి చేస్తున్నాయి. వీటి బారినపడి ఎందరో అసువులు బాస్తుండగా దేశవ్యాప్తంగా కోట్లాదిమంది ఆస్పత్రిపాలవుతున్నారు. సీజన్ మారినప్పుడల్లా ఈ విషజ్వరాలు ప్రజారోగ్యంపై దాడిచేయడం మామూలే అయినా ఇటీవల కాలంలో బాగా పెరిగిపోతున్నాయి. గతంలో ఇంతటి తీవ్ర పరిస్థితులను ఎదుర్కొన్న దాఖలాలు లేవని డాక్టర్లే అంగీకరిస్తున్నారు. దేశంలో ప్రజారోగ్యం ఇంతటి తీవ్ర పరిస్థితుల్లో ఉంటే బాధ్యతకలిగిన పాలకులు పట్టించుకోకపోవడం దురదృష్టకరం.ఈ వ్యాధులే కాదు కేన్సర్,ఎయిడ్స్‌లాంటి ప్రాణాంతక వ్యాధులు కూడా ప్రబలిపోతున్నాయి. ఎంతో ఆధునిక విజ్ఞానం సముపార్జించుకున్నామని విర్రవీగే మానవజాతిపై వారూవీరు అనిలేకుండా అందరూ బలైపోతున్నారు. ఆ శక్తిముందు మానవుడు ఎప్పుడూ తలవంచుకోవాలనే వాస్తవాన్ని చాటుతూ వ్యాధులు ప్రజల ప్రాణాలు తీస్తున్నాయి. సైన్స్ ఎంతో అభివృద్ధిచెందిందని, ఎన్నోకొత్త మందులు కనుగొంటున్నామని చెప్పుకుంటున్న మానవుని మేధాశక్తిని సవాల్ చేస్తూ ఎప్పటికప్పుడు కొత్త కొత్త జబ్బులు వస్తూనే ఉన్నాయి.కరోనా చేసిన బీభత్సం మరువకముందే మంకీపాక్స్‌తోపాటు మరికొన్ని వ్యాధులు ప్రబలిపోతున్నాయి.వర్షాలు అధికం కావడం,వరదల నీరు వెళ్లేదారి లేక మురుగుకుంటలు ఏర్పడడం, తద్వారా దోమలు విపరీతంగా పెరిగి జ్వరాలు విజృంభిస్తున్నాయి. అటు ప్రైవేట్ ఆస్పత్రులు,ఇటు ప్రభుత్వ ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ఈ వ్యాధులు సోకిన లక్షీప్రసన్నుల సంగతి ఎలావున్నా చిన్నాచితక వ్యాపారంపై ఆధారపడి జీవనం సాగించేవారు రోజువారీ కూలీలు, చివరకు మధ్యతరగతి ప్రజల పరిస్థితికూడా దారుణంగా తయారైంది. అన్నింటికంటే ముఖ్యంగా మౌలికవసతులు ఏర్పర్చడంలో నేటికీ పాలకులు సఫలీకృతం కాలేకపోతున్నారు.అదుపు లేకుండా విస్తరిస్తున్న డెంగ్యూ పై తెలంగాణా ప్రభుత్వం యుద్ధమే ప్రకటించింది. నియంత్రించేందుకు చర్యలకు శ్రీకారం చుట్టింది. సోమవారం వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి, పురపాలకశాఖ మంత్రి సమావేశం నిర్వహించి నివారణకు యుద్ధప్రాతిపదికపై చర్యలు చేపట్టాల్సిందిగా ఆదేశించారు. తెలంగాణాలోనే కాదు దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఈ విషజ్వరాలతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ విషజ్వరాలు ఇలా పెద్ద ఎత్తున సోకడం ఇది మొదటి సారికాదు,చివరి సారి కాకపోవచ్చు.ముందుజాగ్రత్తలు లేకపోవడమేఇందుకు ప్రధాన కారణంగా చెప్పచ్చు.నిధుల కొరత లాంటి అనేక సమస్యలతో దేశంలో ప్రజారోగ్య వ్యవస్థ పరిస్థితి రాను రాను పతనావస్థకు చేరుకొంటున్నది.భారత్‌లో వైద్య ఆరోగ్య వ్యవస్థల్లోని డొల్లతనం,కొవిడ్ మహమ్మారి కళ్లకు కట్టింది. వైద్యరంగంలో మౌలికసదుపాయాలు,ముఖ్యంగా మానవ వనరుల కొరత ఎంత తీవ్రంగా ఉందో మొన్నటి కరోనాకాలం అద్దంపట్టింది. దేశంలో దాదాపు ఆరులక్షల మందికిపైగా వైద్యులు,ఇరవై లక్షల మందికిపైగా నర్సుల కొరత ఉన్నట్లు గతంలో అధ్యయనం చేసిన నిపుణుల బృందం స్పష్టం చేసింది.డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది కొరత తీవ్రస్థాయిలో ఉంది.వైద్యుల కొరత విషయంలో జార్ఖండ్, ఉత్తరప్రదేశ్,బీహార్, ఛత్తీస్‌గఢ్ లాంటి రాష్ట్రాలు అగ్రస్థానాల్లో ఉన్నాయి.వైద్యుల కొరతను తీర్చేందుకు పాలకులు నిర్దిష్టమైన ప్రణాళికతో ముందుకు అడుగులు వేయలేకపోతున్నారు. జాతీయవైద్యమండలి వివరాల ప్రకారమే భారత్‌లో ఉన్న దాదాపు ఐదువందల అరవైకిపైగా వైద్యకళాశాలలో ఎనభైఆరు వేలసీట్లు అందుబాటులో ఉన్నాయి.సీట్ల కొరతతో దేశం నుంచి వేలాది మంది విద్యార్థులు చైనా,ఉక్రెయిన్, రష్యా, ఫిలిప్పీన్స్ వంటి దేశాలకు తరలిపోతున్నారు. మొత్తం మీద గ్రామీణ ప్రాంతంలో ప్రజారోగ్యం పతనం అంచునకు చేరుకున్నదనే చెప్పొచ్చు. పెద్దపెద్ద రోగాల సంగతిఅటుంచి చిన్న వ్యాధులకు వాడే సూదిమందు, మందుబిళ్లలు, ప్రభుత్వ వైద్యశాలలో దొరకడం లేదు. మొత్తానికి ఇవన్నీ కలిపి ప్రజారోగ్యాన్ని పతనం అంచునకు చేరుస్తున్నాయి. ఉన్న కొద్దిపాటి సిబ్బందితో కూడా పనిచేయించుకోవాలనే దుస్థితిలో పాలకులు ఉన్నారనేది వాస్తవం. అన్నింటికంటే మించి గ్రామీణ ప్రజలను అల్లాడిస్తున్న విషజ్వరాల సమాచారాన్ని సేకరించే వారే కరవయ్యారు. గతంలో గ్రామీణ ప్రాంతంలో ఇంటింటికి వెళ్లి వారికి సోకుతున్న వ్యాధుల గురించి వివరాలు సేకరించి కొన్ని మందులు కూడా ఇచ్చేవారు. ప్రస్తుతం ఆ కార్యక్రమం దాదాపు ఆగిపోయిందనే చెప్పొచ్చు. ఉన్నకొద్దిపాటి సిబ్బంది కూడా గ్రామాలకు వెళ్లే పరిస్థితిలో లేరు. అందువల్ల వ్యాధుల తీవ్రత గురించి ప్రభుత్వానికి సమగ్రమైన సమాచారం లేకుండాపోతున్నది. నగరాల్లో కొంతమేరకు సమాచారం సేకరించగలుగుతున్నా గ్రామీణ ప్రాంతాలు ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. పాలకులు ఇప్పటికైనా రాజకీయాలకు అతీతంగా ప్రజారోగ్యాన్ని కాపాడే విషయంలో త్రికరణశుద్ధిగా ప్రయత్నం చేయాలి. అవసరం మేరకు నిధులు, సిబ్బం దిని నియమించాల్సిన సమయమిది.

ప్రవర్తన అనేది తెల్లకాగితం లాంటిది. ఒక్కసారి దానిమీద మరకపడితే, మళ్లీ తెలుపు కావడం కష్టం.



బెంజిమెన్ ఫ్రాంక్లిన్

సమకాలికులు ఎప్పుడూ వ్యక్తి ప్రతిభ కన్నా, వ్యక్తినే ఎక్కువగా పొగుడుతారు. ఆ తర్వాత తరంవారే ప్రతిభను గౌరవిస్తారు.



కోల్టన్

## ప్రజావాక్కు



### కాటారంని డివిజన్ కేంద్రంగా ప్రకటించాలి

జయశంకర్ భూపాపల్లిజిల్లాలోని కాటారం మండలాన్ని డివిజన్ కేంద్రంగా ప్రభుత్వంప్రకటించాలి.గతంలో కాటారం కరీంనగర్ జిల్లాలో, మంథని డివిజన్‌లో ఉండేది. కొత్త జిల్లాల ఏర్పాటు వల్ల కాటారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాకి రావడం జరిగినది. కాటారం ప్రస్తుతం వ్యాపారం, వాణిజ్య, విద్య కేంద్రంగా పేరుగాంచినది. చుట్టుపక్కల మండలాలు అయిన మహా ముత్తారం, మల్హర్, పలిమెల, మహదేవ్‌పూర్‌తోపాటు దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన త్రివేణి సంగమం అయిన కాళేశ్వరం కూడా ఈ ప్రాంతంలోనే ఉన్నది. నిత్యం కాటారం గుండా వేలాది వాహనాలు ప్రయాణిస్తూ ఉంటాయి. కాటారం నుండి మిగతా మండలాలు సుమారు ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి.ప్రస్తుతం కాటారంలో సబ్ డివిజన్ అధికారి ఉన్నారు. ఇక్కడ అన్ని ప్రభుత్వ కార్యాల యాలు ఉన్నాయి. రెవెన్యూ డివిజన్‌కి కావలసిన అన్ని అర్హతలు కాటారానికి ఉన్నాయి. ప్రభుత్వం,కాటారం మండల కేంద్రాన్ని డివిజన్ కేంద్రంగా ప్రకటించి అభివృద్ధిపరచాలి.

-కామిడి సతీష్‌రెడ్డి, భూపాలపల్లిజిల్లా

### రైతు భరోసా- నేతిబీరలో నెయ్యి

రాష్ట్రంలో సాధారణ వర్షపాతం నమోదు అయినా, జలాశయాలు నిండుకుండల్లా ఉన్నా, రైతుపరిస్థితి దయనీయంగా ఉంది. నాసిరకం విత్తనాలు, మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో వేసిన పంటకు చీడపీడల బెడద ఎక్కువగా ఉంది. గత 20 రోజులుగా వర్షాభావంతో వేసిన పైర్లు బెట్టకు వస్తున్నాయి. మరోవైపు పాలకుల నిర్లక్ష్యంతో సాగునీటి వనరులకు మరమ్మతులు లేక, పంట కాలువల నిర్మాణాలు లేక, పొలాలకు పారాల్సిన నీరు వృధాగాపోతున్నది. సాగు ఖర్చులు పెరిగి, దిగుబడులు తగ్గి రైతులు పూర్తిగా నష్టపోయే దుస్థితి నెలకొంది. ఇక రైతు భరోసాకు అర్థం లేకుండాపోయింది.

-ఉప్పలపాటి రాజా, గంగన్నగూడెం, ఏలూరుజిల్లా

### మద్యం అమ్మకాలపై వక్రభాష్యాలు

ధరలుపెంచడంవల్లనే రాష్ట్రంలోమద్యపానం తగ్గిందని ముఖ్యమంత్రి చెప్పడం వాస్తవ విరుద్ధం.ప్రభుత్వం సరఫరా చేస్తున్న మద్యం నాసిరకం కావడంతో మద్యపాన ప్రియులు అవకాశం ఉన్నంతవరకు పక్కరాష్ట్రాలనుంచి అక్రమంగా వస్తున్న మద్యాన్ని సేవిస్తున్నారు. పేదలునాటుసారాకి అలవాటు పడిపోయారు. మరోవైపు పనులులేక, ఆదాయం లేక కూడా మద్యం వినియోగం తగ్గింది. అసలు మద్యం అమ్మకం లెక్కల్లోనే పారదర్శకత లేదన్న విమర్శలు వస్తున్నాయి.

-జి.రామకృష్ణ, ఏలూరు, ఏలూరుజిల్లా

### పాలకుల నిర్లక్ష్యానికి రైతుబలి

గతసంవత్సరం పులిచింతల ప్రాజెక్టు గేట్ కొట్టుకుపోయినప్పుడే దినపత్రికల్లో రాష్ట్రంలో వివిధ సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై ఇంజినీరింగ్ నిపుణులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆతర్వాత అన్నమయ్య డాం వరద సందర్భంలోనూ అధికారుల నిర్వాకంతో డాం కొట్టుకుపోయింది. అయినా ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులమరమ్మతులు, నిర్వహణపై దృష్టి సారించలేదు. పైగా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందంటూ బురద రాజకీయాలతో కాలక్షేపంచేశారు. ఇప్పుడు గుండ్లకమ్మ ప్రాజెక్టు గేట్ కొట్టుకుపోయి నీరంతా వృధాగాపోతుంది. ఇప్పటికే వివిధ సాగునీటి ప్రాజెక్టులలో అమర్చిన గేట్ల లీకేజీలతో ఎంతో నీరు వృధాగా పోతున్నది. పూడికలు తీయడం లేదు. గుర్రపు డెక్క, రబ్బరుకాడ, జమ్మువంటి నీటిమొక్కలతో కాలవల్లో నీరుసరిగా పారడం లేదు.కిందిస్థాయి అధికారులు ఎప్పుడు అడిగినా ( మూడు సంవత్సరాలుగా తప్పించుకుంటున్నారు.

- జి.రామకృష్ణ, ముస్తాబాద, కృష్ణాజిల్లా

### పోక్సో చట్టంపై ప్రచారం కల్పించాలి

మనదేశంలో బాలికలపై అఘాయిత్యాల కేసులు పెరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇటువంటి నేరాల నివారణకు భారత ప్రభుత్వం2012లో పోక్సో చట్టం తీసుకువచ్చింది. బాలికలపై వేధింపులు,లైంగికదాడుల నివారణకు ఎన్ని చట్టాలు తెచ్చినా అత్యాచారయత్నాలు ఆగడంలేదు. కామాంధుల వక్రబుద్ధి మారడంలేదు. యుక్తవయసులో బాలికలలో వచ్చే శారీరక,మానసిక మార్పులగురించి,యువకులు చెప్పే మాయమాటల గురించి పాఠశాల, కళాశాల స్థాయిలో మహిళా ఉపాధ్యాయులు ప్రతివారం అవగాహన కల్పించాలి. పోక్సో చట్టం గురించిన పోస్టర్లను ప్రతి పాఠశాలలో, కళాశాలలో ఏర్పాటు చేయాలి. పోక్సో మొబైల్ యాప్ గురించి కౌమార బాలికలకు అవగాహన కల్పించాలి.

-చల్లా చంద్రశేఖర్‌రెడ్డి, కలువాయి, నెల్లూరుజిల్లా

### వి.ఆర్.యేల సమస్యలు పరిష్కరించాలి

రాష్ట్రవ్యాప్తంగా ఆయా గ్రామాలలో పనిచేస్తోన్న వి.ఆర్.యేలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతూ ఉన్నారు. గత పది రోజులుగాఅన్నిమండల కేంద్రంలలో నిరవధికసమ్మెకు దిగారు. చాలీచాలని వేతనాలతో బతుకులు వెళ్లదీస్తున్న వీరి డిమాండ్లు న్యాయ సమ్మతమైనవే. ఉద్యోగభద్రత కల్పించాలని, అసెంబ్లీలో సియం చెప్పిన విధంగా పే స్కేల్స్ వర్తింపచేయాలని, వేతనాలు పెంచాలని కోరుతూ సమ్మె చేస్తున్నారు. వారి డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి.

-కె. రెడ్డి, భూపాలపల్లిజిల్లా

ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిణామాలకు సంబంధించిన విశ్లేషణాత్మక వ్యాసాలు పంపగోరేవారు ఈ కింది ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. e-mail : editpage@vaartha.com

# హాస్టళ్లలో ఏదీ 'ఆహార భద్రత'?

**ఓ ఐ.పియస్ అధికారి ఎనిమిది సంవత్సరాలపాటు కార్యదర్శిగా ఉన్నప్పుడు ప్రపంచస్థాయి ఉన్నత విద్యాప్రమాణాలను నెలకొల్పడంతోపాటు ఏజెన్సీ ప్రాంతాలలో అడవులకే పరిమితమై జీవించే గిరిజన బిడ్డలను జాతీయస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దే క్రమంలో మాలా వత్ పూర్ణలాంటి అనేకమంది ఆణిముత్యాలను సృష్టించిన ఆదర్శ వంతమైన రెసిడెన్షియల్ విద్యాసంస్థల సమాహారంగాకేస్‌స్టడీ కోసం హార్వర్డ్‌విశ్వవిద్యాలయ పరిశోధకులను ఆకర్షించిన గురుకులాల వ్యవస్థ ఈరోజుకనీసం పౌష్టికాహారాన్ని సమకూర్చలేక కనీస పారిశుధ్యాన్ని కొనసాగించలేక పనేషియా హెల్త్‌కమాండ్ సెంటర్ లాంటి నిరంతర ఉచితప్రత్యేక వైద్యవ్యవస్థను కొనసాగించలేక సదరు గురుకులాల విద్యార్థుల అకాలమరణాలకు కారణమవుతుండడానికి కారణాలను ఎలాంటి భేషజాలకు పోకుండా ఆత్మపరిశీలన చేసుకోవాలి.**



నీలం సంపత్

రెండువేల రెండు సంవత్సరంలో చేసిన 86వ రాజ్యాంగ సవరణలో భాగంగా సవరించబడిన ఆర్టికల్ 21ఎ ప్రకారం ఈ దేశంలో ఆరు నుండి 14 సంవత్సరాల మధ్య వయస్సుగల బాలబాలికలకు ఉచిత నిర్బంధ విద్యను సమకూర్చాల్సిన బాధ్యత విద్యాహక్కు చట్టం ప్రకారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే కావడం గమనార్హం. అందులో భాగంగానే దేశంలోని అన్ని రాష్ట్రాలు,కేంద్రపాలిత ప్రాంతాలలో పాలకులు ఈ రాజ్యాంగపరమైన బాధ్యతను త్రికరణశుద్ధిగా నిర్వర్తించాల్సిందే. సదరు బాధ్యతను నిర్వర్తించే క్రమంలో భాగంగా అర్హులైన నిరుపేద బడుగుబలహీన వర్గాల విద్యార్థుల కోసం వీలైన చోట్లలో రెసిడెన్షియల్ పాఠశాలలను స్థాపిస్తూ వీలుకాని కొన్ని చోట్ల మధ్యాహ్న భోజన సహాయాన్ని సమకూరుస్తూ మరోవైపు సదరు ప్రభుత్వ పాఠశాలలకు అనుసంధానంగా వసతి గృహాలను నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ విధానాల లోపమో, హాస్టళ్ల నిర్వాహకుల పర్యవేక్షణ వైఫల్యమో, వైద్యసేవలు అందుబాటులో లేకపోవడం మూలంగానో, సరైన పారిశుధ్యపరిస్థితులు లేక అనారోగ్యం బారినపడో లేదా ఫుడ్‌పాయిజనింగ్ మూలంగానో రాష్ట్రంలోరోజూ ఏదో ఒక రెసిడెన్షియల్ పాఠశాలలోనో, సంక్షేమ వసతి గృహంలోనో పదులసంఖ్యలో విద్యార్థులు అనారోగ్యం బారినపడడమే కాదు, అక్కడక్కడా అకాల మరణాల పాలిట పడుతున్న వైనం ఆందోళన కలిగిస్తోంది.ఎస్సీ,ఎస్టీ బడుగు బలహీనవర్గాలకుచెందిన విద్యార్థులకు వారసత్వ సంపదగా వచ్చిన రక్తహీనత ఫలితంగా సక్రమించే అనేక ప్రాణాంతక అంటువ్యాధులు, మెజారిటీ సంక్షేమ విద్యాసంస్థలకు సొంత భవనాలు లేక ఇరుకు గదుల్లోనో, ఆరుబయట అనారోగ్యకర పరిసరాల్లో వంటలను చేస్తున్న నేపథ్యంలో పారిశుధ్యం లోపించడం కొంతమంది ప్రిన్సిపాల్లూ, వార్డెన్ల అవినీతి కారణంగా కల్తీతోకూడిన ఆహార పదార్థాలు వంటశాలల్లోకి ప్రవేశిస్తుండడం, ఇన్ని జరుగుతున్నా వాటిని నిరంతరం పర్యవేక్షిస్తూ తగు నియంత్రణ చర్యలను తీసుకోవాల్సిన పర్యవేక్షక సిబ్బంది మామూళ్లతో సరిపుచ్చుకుంటూ ఉదాసీనతతో వ్యవహరిస్తుండడంతోపాటు పురుగులూ, బొద్దింకలతో కూడిన ఆహార పదార్థాలు కొన్ని చోట్ల విద్యార్థుల ప్రాణాలను తీసే విషపదార్థాలుగా మారుతున్న వైనం బాధాకరం. ఈ దేశ భవిష్యత్ ఆశాకిరణాలుగా మారుతారనుకునే విద్యార్థులు అకాల మృత్యువాత పడుతుంటే సదరు వసతి గృహాలకు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలకు కూతవేటు దూరంలో ఉన్న జిల్లాస్థాయి అధికారుల నేతృత్వంలోని ప్రభుత్వ యంత్రాంగం నిమ్మకు నీరెత్తుతుండడం సమస్యను మరింత జటిలం చేస్తుంది. దీనికి తోడు సదరు విద్యాసంస్థలను క్షేత్రస్థాయిలో నిర్వహించే ప్రిన్సిపాల్‌కు హాస్టళ్ల నిర్వహణలో భాగంగా రోజూ వంట వాళ్ల పని తీరుని ప్రత్యక్షంగా పర్యవేక్షించడం అదనపు భారంగా మారడం,మరీ ముఖ్యంగా హాస్టల్ బోర్డర్లు అనారోగ్యం బారిన పడినప్పుడు వారికి అవసరమైన తక్షణ ట్రీట్‌మెంట్‌ను సమకూర్చే ఆర్థిక వెసులుబాటు గానీ వైద్యసదుపాయాలు గాని వసతి గృహాలలో అందుబాటులో లేకపోవడం కారణంగా వారు ఇలాంటి అత్యంత దురదృష్టఘటనలు జరగకుండా నివారించలేక పోతున్నారనే భావన కూడా ప్రచారంలో ఉంది. ఐదువందలపై చిలుకు బోర్డర్లు అరకొర వసతులతో కూడిన వసతి గృహాలలో నివసించాల్సి వస్తున్న నేపథ్యంలో అపరిశుభ్రతతో కూడిన వాతావరణంలో విద్యార్థులు అనారోగ్యం బారినపడుతున్నారు. అనారోగ్యం బారినపడిన విద్యార్థులకు దగ్గరలో వున్న ప్రభుత్వ ఆస్పత్రులే ఏకైక దిక్కు. కాగా ప్రైవేట్ ప్రాక్టీస్ రుచిమరిగిన డాక్టర్లు



అందుబాటులో ఉండకపోవడం ఫలితంగా సదరు ఆస్పత్రుల్లో పనిచేసే నర్సింగ్ సిబ్బందే తూతూ మంత్రంగా ఏ రోగ నిర్ధారణ పరీక్షలు చేయకుండానే తమకు తోచిన మందుబిళ్లలతో వైద్యం చేసి తగ్గకపోతే జిల్లా,రాష్ట్రస్థాయి హాస్పిటళ్లకు రెఫర్ చేసి చేతులెత్తేస్తుండడం తీరా సదరు పెద్దాస్పత్రులకు విద్యార్థులను చేరవేసే క్రమంలోనే రోగం ముదిరి మార్గమధ్యంలో మరణిస్తున్న వైనాన్ని గమనిస్తే గుండె చెరవుతోంది. ట్రిబుల్ ఐటి లాంటి జాతీయ స్థాయి విద్యాసంస్థలే అపరిశుభ్రత నిలయాలుగా మారుతుంటే మామూలు సంక్షేమ వసతిగృహాల నిర్వహణ నడిగేదెవరు? ఆర్.జి.కె.టి.యు బాసర లాంటి జాతీయ స్థాయి విద్యాసంస్థలో గత కొన్ని నెలలుగా అత్యంత అనారోగ్యకరమైన, పారిశుధ్యలేమితో కూడిన పరిసరాల్లో, కలుషితమైన ఆహార పదార్థాలను తింటూ అనారోగ్యంతో కొట్టుమిట్టాడుతున్న విద్యార్థుల అగచాట్లను ఎలక్ట్రానిక్ అండ్ ప్రింట్ మీడియా సాక్షిగా తెలుసుకున్న వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రత్యక్ష కార్యాచరణతో ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. శాశ్వత వైస్ చాన్సలర్ నియామకం తీరని కోరికగా మిగిలింది. విద్యార్థులకు అవసరమైన లాప్‌టాప్‌లు, లేదా కనీసం టాబ్‌లైనా సమకూర్చాల్సిన బాధ్యతను ప్రభుత్వం మరిచిపోయింది. పరిశుభ్రమైన వాతావరణంలో పౌష్టికాహారాన్ని అందించమని ప్రాధేయపడిన విద్యార్థులు వారి తల్లిదండ్రులను ఉద్దేశించి రాష్ట్ర విద్యాశాఖామంత్రి సిల్లీగా మాట్లాడకండంటూ చేసిన ప్రకటన అత్యంత దురదృష్టకరమైనదేనని బుద్ధిజీవులనుకుంటున్నారు. ట్రిబుల్‌ఐటిలో ఈ అత్యంత దురదృష్టకరమైన పరిస్థితులకు కారణం స్థానిక పత్రికల్లో విలేకరులుగా పనిచేస్తున్నవారే బినామీల రూపంలో కాంట్రాక్టర్లుగా కొనసాగడమే ఆరోపణలు అదే మీడియాలో విస్తృతంగా ప్రచారం జరిగినా ప్రభుత్వం సదరు నేరస్తులెవరో తెలుసుకునే ప్రయత్నం కూడా చేయకపోవడం అనేకఅనుమానాలకుతావిస్తోంది. మరోవైపు ఈ దయనీయ స్థితి గురించి ఎవరు ప్రశ్నిస్తే వారిని అభివృద్ధి నిరోధకులుగా ముద్రవేయడం, విశ్వవిద్యాలయాల ఛాన్సలర్ హోదాలో సాక్షాత్తూ ఈ రాష్ట్రగవర్నర్ పర్యటించి విశ్వవిద్యాలయంలో విద్యార్థులు అనేకసమస్యలను ఎదుర్కొంటున్న వైనాన్ని పత్రికలూ, ప్రసార సాధనాల ముందు ప్రస్తావించినప్పుడు కేంద్ర ప్రభుత్వం గవర్నర్ వ్యవస్థద్వారా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెడుతుందని ఎదురుదాడి చేయడంతోపాటు గవర్నర్ విజిట్ తర్వాత విద్యార్థులను ప్రశ్నించేహక్కుని ఉక్కుపాదంతో అణచివేయాలనే నిర్ణయంతీసుకోవడమంటే విద్యార్థులను సైతంప్రభుత్వం రాజకీయ శత్రువులుగా భావిస్తుందనే భావన సర్వత్ర వెల్లువెత్తుతోంది.రాష్ట్రవ్యాప్తంగా అన్ని రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, సంక్షేమ వసతి గృహాలలో నాణ్యమైన విద్యాబోధనతోపాటు పౌష్టికాహార పంపిణీ,పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలి. అందుకు అవసరమైన బడ్జెట్ కేటాయింపులతోపాటు వసతిగృహాలలో వంటశాలల పని తీరుని మెరుగుపరచాలి. వసతి గృహాలలో విద్యార్థుల ఆరోగ్యాన్నిపరిరక్షించడానికి అవసరమైన వైద్యసదుపాయాల కల్పన కోసం ఓ ప్రత్యేక వైద్యవ్యవస్థను ఏర్పాటు చేయాలి. లేదా నిర్దిష్ట సూచన లలో ప్రభుత్వ వైద్య వ్యవస్థకైనా అనుసంధానం చేస్తూ నిరంతరం పర్యవేక్షించాలి.అన్నింటికన్నా ముఖ్యంగా ఓ ఐ.పియస్ అధికారి ఎనిమిది సంవత్సరాలపాటు కార్యదర్శిగా ఉన్నప్పుడు ప్రపంచ స్థాయి ఉన్నత విద్యాప్రమాణాలను నెలకొల్పడంతోపాటు ఏజెన్సీ ప్రాంతాలలో అడవులకే పరిమితమై జీవించే గిరిజన బిడ్డలను జాతీయస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దే క్రమంలో మాలావత్ పూర్ణలాంటి అనేకమంది ఆణిముత్యాలను సృష్టించిన ఆదర్శవంతమైన రెసిడెన్షియల్ విద్యాసంస్థల సమాహారంగా కేస్‌స్టడీ కోసం హార్వర్డ్ విశ్వవిద్యాలయ పరిశోధకులను ఆకర్షించిన గురుకులాల వ్యవస్థ ఈ రోజు కనీసం పౌష్టికాహారాన్ని సమకూర్చలేక కనీస పారిశుధ్యాన్ని కొనసాగించలేక పనేషియా హెల్త్ కమాండ్ సెంటర్‌లాంటి నిరంతర ఉచితప్రత్యేక వైద్యవ్యవస్థను కొనసాగించలేక సదరు గురుకులాల విద్యార్థుల అకాలమరణాలకు కారణమవుతుండడానికి కారణాలను ఎలాంటి భేషజాలకు పోకుండా ఆత్మపరిశీలన చేసుకోవాలి. వేలకోట్ల రూపాయల బడ్జెట్‌తో నిర్వహించబడే రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో అడుగడుగునా అవినీతి అనకొండలు విద్యార్థుల కడుపుగొడుతూ తమ కడుపులు నింపుకునే ప్రమాదమున్న నేపథ్యంలో ఫుడ్ ప్రొవిజన్స్ ప్రొక్యూర్‌మెంట్ దగ్గర నుండి కుకింగ్, సానిటేషన్ కాంట్రాక్టర్ల వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. ●

# భారత్ జోడోయాత్ర కాంగ్రెస్‌కు కలిసొచ్చేనా?

డా.యం.సురేష్‌బాబు

సామాజిక, సామరస్యాన్ని, రాజ్యాంగ విలువలను బలోపేతం చేయడానికి కాంగ్రెస్ భారత్ జోడో యాత్రకు శ్రీకారం చుట్టింది. ప్రజావ్యతిరేక విధానాల వల్ల ప్రజల బతుకులు చిన్నాభిన్నమైపోయాయి. క్లిష్ట పరిస్థితుల్లో దేశ ప్రజల భద్రతకు భరోసా లేకుండాపోయింది. లౌకిక ప్రజాతంత్ర వాదులు, ప్రజాసంఘాలు ఈ యాత్రలో పాల్గొంటున్నారు. 80 ఏళ్ల క్రితం ఇదే రోజున మహాత్మాగాంధీ నాయకత్వంలో భారత జాతీయ కాంగ్రెస్ క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రారంభించింది. ఐదేళ్ల తర్వాత ఈ ఉద్యమం భారతదేశానికి స్వాతంత్ర్యానికి దారితీసిందని ఆయన అన్నారు. భారతదేశం అంతటా ఐక్యతా సందేశాన్ని వ్యాప్తి చేయడానికి, స్వతంత్ర భారతదేశంలో కాంగ్రెస్ పార్టీ మొదటి పాన్-ఇండియన్ మార్చ్‌ను గుర్తించ డానికి ఉద్దేశించిన ప్రతిష్టాత్మక యాత్ర. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దీనికి నాయకత్వం వహిస్తున్నారు. రాహుల్‌గాంధీ మాట్లాడుతూ ఇది సైద్ధాంతిక యుద్ధం. కాంగ్రెస్ సిద్ధాంతం మాత్రమే దేశాన్ని ప్రగతి పథంలోకి తీసుకెళ్తుంది. కాంగ్రెస్ కార్యకర్తలు మాత్రమే భారతదేశాన్ని రక్షించగలరు. కాంగ్రెస్ పార్టీ ఇతర పార్టీలతో కలిసి బిజెపి, ఆర్ఎస్ఎస్‌లను ఓడిస్తుంది. ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్ ఆఫ్ ఇండియాలో కాంగ్రెస్ ఎంపి రాహుల్ గాంధీ పౌర సమాజ సంస్థల ప్రతినిధులతో సంభాషించారు. దాదాపు వందకుపైగా పౌర సమాజ సంస్థలు స్వచ్ఛంద సంస్థలు ఈయాత్రలో పాల్గొంటున్నారు. కాంగ్రెస్ పార్టీ సెప్టెంబర్ ఏడవ తేదీన శ్రీకారం చుట్టనున్న భారత్‌జోడో యాత్ర కన్యాకుమారిలో మొదలై కశ్మీర్‌లో పూర్తికానుంది. ఇందులో భాగంగా దేశంలోని 12 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల గుండా ఏకంగా 3,570 కిలోమీటర్ల పొడవునా ఈయాత్ర కొనసాగనుంది. కలిసి నడుద్దాం, దేశాన్ని కలిపి ఉంచుదాం (మిలే కదమ్.. జోడే వతన్) నినాదంతో సుదీర్ఘంగా ఐదు నెలలపాటు ఈ ప్రజా ఉద్యమం ముందుకు కొనసాగుతుంది. ఏకధృవ సామాజిక పోకడ, దేశంలో నెలకొన్న ఆర్థిక అసమానతలు, విద్వేషాలను రూపుమాపేందుకు కాంగ్రెస్ నడుం బిగించింది. కుల,మతాలకతీతంగా దేశ ప్రజానీకం పాదయాత్రలో కదంతొక్కనున్నారు. పాదయాత్రగా కొనసాగే ఈ కార్యక్రమాన్ని స్వాతంత్ర్య భారతంలో అతిపెద్ద ప్రజాస్వామ్య ఉద్యమ స్థాయికి తీసుకెళ్లాలని పార్టీ భావిస్తోంది. తమిళనాడులోని కన్యాకుమారి నుండి పాదయాత్రను మొదలుపెట్టనున్నారు. తర్వాత తిరువనంతపురం, కొచ్చి, నీలాంబర్, మైసూరు, బళ్లారి, రాయచూర్ మీదుగా యాత్రను కొనసాగిస్తారు. షెడ్యూల్‌లో భాగంగా తెలంగాణలోని వికారాబాద్‌లోనూ యాత్ర ఉంటుంది. మహారాష్ట్రలో నాందేడ్, తర్వాత జల్గావ్, మధ్యప్రదేశ్‌లోని ఇండోర్, రాజస్థాన్‌లోని కోటా పట్టణం తర్వాత దౌసా, అల్వార్‌లో పాదయాత్ర ముందుకు వెళ్లనుంది. ఉత్తరభారతం విషయానికొస్తే ఉత్తరప్రదేశ్‌లోని బులందర్ షహర్, తర్వాత దేశ రాజధాని ఢిల్లీ, అంబాలాలనూ పాదయాత్ర పలకరించనుంది. జమ్మూ పట్టణం, ఆ తర్వాత చివరిగా శ్రీనగర్‌లో పాదయాత్ర పూర్తికానుంది. భౌగోళికంగా నదీజలాలు, కొండలు, అటవీ ప్రాంతం పాదయాత్ర మార్గానికి ఆటంకం కలగకూడదని అవి లేని మార్గాల్లో పాదయాత్ర రూట్‌మ్యాప్‌కు కాంగ్రెస్ నాయకులు తుదిరూపునిచ్చారు. ●

# ఎర్రకోట నుండి చేసిన ప్రతిజ్ఞలు ఏమయ్యాయి?



డాక్టర్. ఏనుగొండ నాగరాజ నాయుడు

మన ప్రధానమంత్రులు ప్రతి సంవత్సరం ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం వేడుకల్లో ఎర్రకోటపై నుంచి గత 75 సంవత్సరాలుగా ప్రసంగిస్తూ అనేక వాగ్దానాలు ప్రజలకు ఇస్తున్నారు. నేడు 75వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మన ప్రధాన మంత్రి రాబోయే 25 సంవత్సరాల్లో చేయవలసిన భవిష్యత్తు కార్యక్రమాన్ని పంచసూత్రపథకం లాగా ప్రజలకు ఐదువాగ్దానాలు చేశారు.2047వ సంవత్సరం నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఉండాలి. వలస పాలన మూలాలను తొలగించాలి, దేశ వారసత్వాన్ని కాపాడాలి, ఐక్యత సమగ్రదేశంగా భారత్ ఉండాలి. దేశ పౌరులు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75సంవత్సరాల తర్వాత ప్రధాని పైవాటిని సాధించాలని కోరుకుంటున్నారంటే ఆశ్చర్యం వేయక పోదు. ఈ ఐదు లక్ష్యాలను సాధించడానికి కూడా బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అనేకమంది పోరాడి ప్రాణత్యాగం చేసిన తర్వాతనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది.75 సంవత్సరాలు గడిచిపోయాయి. ఒక్కసారి గతాన్ని సింహాలోకనం చేసుకుంటే మొదటి ప్రధానమంత్రిగా పండిట్ జవహర్‌లాల్‌నెహ్రూ ప్రమాణస్వీకారం తర్వాత వలస పాలన దోపిడీ నుంచి పేదరికాన్ని నిరుద్యోగాన్ని రూపుమాపేందుకు ప్రభుత్వ పర్యవేక్షణలో పంచవర్ష ప్రణాళికలు రూపొందించి శాస్త్ర సాంకేతిక పారిశ్రామిక వ్యవసాయ అభివృద్ధికి పునాదులు వేశారు.ప్రజల జీవన ప్రమాణాల నుంచి జీవన ఉపాధి సౌకర్యాలు కల్పించి ఉత్పాదక, అనుత్పాదక రంగాలను బేరీజు వేసుకొని పెట్టుబడులు పెట్టారు. తద్వారా సామ్యవాద తరహా సమాజాన్ని స్థాపించాలని ప్రయత్నించారు. 1952లో మొదటి పంచవర్షప్రణాళికను ప్రచురించాం. ఇందులో పారిశ్రామికీకరణకు ప్రాధాన్యత ఇచ్చినా వ్యవసాయరంగాన్ని అభివృద్ధిపరచి 25శాతం ఉత్పత్తులను పెంచాం. శ్రమ సాంద్రత ఉత్పత్తిపద్ధతుల ద్వారానే ఇది సాధ్యమైంది.అయితే కాంగ్రెస్ పెద్దలంతా భూస్వామ్య వారసులే అయినందున రాష్ట్రాలలో గాని దేశంలోగానే కాంగ్రెస్ పాలనే కాబట్టి ఆశించిన మేరకు భూసంస్కరణల అమలు కాలేదు. దున్నేవాడికే భూమి చెందలేదు. రెండో పంచవర్షప్రణాళిక ప్రభుత్వ పర్యవేక్షణలో పారిశ్రామికీకరణకు ప్రాధాన్యత ఇవ్వడం వలన ప్రైవేట్ రంగాన్ని నియంత్రించడంవలన లైసెన్స్ రాజ్యమనిఆనాడు పాలకులు పేరు తెచ్చుకోవడం జరిగింది.అయినప్పటికీ వ్యవసాయ రంగంలో 20శాతం వృద్ధి పారిశ్రామిక రంగంలో ఏడుశాతం వృద్ధి తద్వారా జాతీయ ఆదాయం నాలుగుశాతం పెరిగి ఆర్థిక వ్యవస్థ ఆశాజనకంగా వృద్ధిలోకి రావడం జరిగింది.అయితే జనాభా రెండు శాతం పెరగడంవలన ఆనాడు ఆ వృద్ధి పేదరికాన్ని నిరుద్యోగాన్ని తొలగించలేకపోయింది.అంతేకాకుండా కాంగ్రెస్ పాలన దేశంఅంతా సాగుతుండగా నియంతృత్వధోరణి వలన దేశంలో ప్రజాస్వామ్యం పరుగులెత్తలేకపోయింది. చివరకు కొత్త కాంగ్రెస్ పాత కాంగ్రెస్‌గా కాంగ్రెస్ చీలిపోయింది. 1975లో దేశంలో అత్యవసర పరిస్థితిని విధించవలసి వచ్చింది. నూతనంగా దేశవ్యాప్తంగా జనతాపార్టీ ఆవిర్భవించింది.అలా మొదటి మూడుదశాబ్దాలలో అనగా 1950-1980మధ్యకాలంలో జాతీయ ఆదాయం పెరుగుదల రేటు కేవలం 3.5శాతంగాఉండడం వలన ఇలా అతితక్కువగా జాతీయఆదాయ పెరుగుదల రేటుకు హిందూ గ్రోత్‌రేట్ అని నామకరణం చేశారు. పేదరికం నిరుద్యోగం విలయతాండవం చేశాయి.ఆహార ధాన్యాల కొరత ఏర్పడింది.అమెరికా సహాయం కోసం మన రూపాయి విలువను తగ్గించారు. వ్యవసాయరంగంలో హరిత విప్లవాన్ని అమెరికా సహాయంతో యాంత్రీకరణ చేపట్టి భూసంస్కరణలకు తిలోదకాలు ఇచ్చారు.1980-84 మధ్యకాలంలో శ్రీమతి ఇందిరా సోషలిస్ట్ నాయకురాలుగా 20 సూత్రాల ఆర్థిక పేదరిక నిర్మూలన పథకాన్ని చేపట్టి బ్యాంకులను జాతీయకరణచేసి ఏకస్వామ్య పెట్టుబడిదారులను నియంత్రించి దేశ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించారు. 1984లో ప్రధానమంత్రి ఇందిరాగాంధీ హత్యకు గురికావడం ఆమె తనయుడు రాజీవ్‌గాంధీ1984-89 మధ్యకాలంలో ప్రధానమంత్రిగా పాలన సాగించి ఇన్ఫర్మేషన్ టెక్నాలజీతో దేశాభివృద్ధి జరగాలని ప్రయత్నించినప్పటికీ,అప్పటికే అప్పులపాలైన దేశం సరళీకృత ఆర్థిక విధానాన్ని చేపట్టి ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ వాణిజ్య సంస్థ కనుసన్నల్లోకి దేశం పోయింది. 1989లో రాజీవ్ గాంధీ కూడా హత్యకు గురికాబడ్డారు. ఇలా దేశంఅశాంతికి గురైంది. అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడ్డాయి. తరువాత పివి నరసింహారావు నాయకత్వం, కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో విద్యాభ్యాసం చేసిన ప్రముఖ ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ సూచనలతో నూతన ఆర్థిక విధానాన్ని దేశాభివృద్ధి వ్యూహంగా రూపొందించారు. ఈ క్రమంలో పేదలు బడుగు బలహీనవర్గాలకు స్వాతంత్ర్యంగానీ సమానత్వం గానీ స్వేచ్ఛగాని అందరినీ కలుపుకొనిపోయే వృద్ధిగాని అనగా అవకాశాలు అందరూ పొందేవిధంగా దేశాభివృద్ధిలేనందువలన అట్టడుగువర్గాలకు నిరాశే మిగిలింది.వలస పాలన ఛాయలలో ప్రజలు బతకవలసి వచ్చింది.అప్పటి యూపిఏ గవర్నమెంట్ కానీ ఇప్పుడు ఉన్న ఎన్డీయే ప్రభుత్వం కానీ దీనికి బాధ్యులుగా మిగిలారు. 2047 నాటికి మనదేశం అభివృద్ధి చెందిన దేశంగా కావాలనీ ఇప్పుడు మన ప్రధానమంత్రి నిన్నటి ఆగస్టు 15న పిలుపునివ్వడంలో ఆశ్చర్యం లేదు.ఎందుకనగా సరళీకృత ఆర్థిక విధానాల వలన మిలియనీర్ బిలియనీర్లుగా పేదలు నిరుపేదలుగా కులమత విభేదాలతో ప్రజలు ఉంటే దేశం మెరిసిపోతున్నదని ప్రచార ఆర్భాటాలకు 20మిలియన్ డాలర్ల ప్రాజెక్టును చేపట్టడం జరిగింది. వాస్తవంగా భారతదేశం పేదదేశం కాదు. అలాగే మెరిసిపోతున్న దేశంకాదు. నిరుపేదలు ఉన్నదేశం. జాతీయ ఆదాయం పెరుగుతున్నరేటులోనే ప్రజలకు ఆదాయాలు పెరిగి ఉంటే ఉద్యోగిత పెరిగి ఉండేది.పేదరికం పోయిఉండేది.ప్రపంచంలోనేమో భారత్ అగ్రగామి దేశంగా స్థూలజాతీయ ఉత్పత్తిలో రెండవస్థానంలోఉంది. నూరు దేశాలకు అప్పుకూడా ఇచ్చాం. అనేక రంగాలలో గణనీయంగా ఉత్పత్తులను సాధించాం. ప్రపంచ కుబేరులలో మనవారు చాలామంది తమ స్థానాన్ని పొందగలిగారు. 2000లో మనదేశంలో తొమ్మిదిమంది మాత్రమే బిలియనీర్లు ఉండగా 2022లో 237 మందికి పెరిగారు. బిలియనీర్లసంపద మన పేదలకు పంచితే ఒక్కొక్కరికి మూడు లక్షల ఇరవైవేలు వస్తుందని నిపుణుల అంచనా. ఇలా భారత్ పెద్దల పెన్నిధిగా ఉండి ప్రపంచ పేదలలో ఒకటిబై నాలుగవ వంతు పేదలుమనదేశంలోనేఉన్నారు. 2020లో ఆక్స్‌ఫామ్ నివేదిక ప్రకారం మన దేశంలో ఒకేఒక్క శాతం జనాభాదగ్గర 43శాతం సంపదఉండగా, 50శాతం జనాభా దగ్గర కేవలం 2.8శాతం మాత్రమే సంపద ఉన్నది. ఆకలి ఎక్కువగా ఉన్న 107దేశాలలో 94వ స్థానంమనది.స్వాతంత్ర్య అమృత మహోత్సవాలు మాత్రం ఘనంగా జరుపుకుంటున్నాం. ఇప్పుడు మరలా మన ప్రధానమంత్రి ఇరవైఐదు సంవత్సరాల లోపు మన దేశం అభివృద్ధి చెందిన దేశంగా ఉండాలని కోరుకుంటున్నారు. ఈ అభివృద్ధి వ్యూహం పేదరికం నిరుద్యోగాన్ని నిర్మూలించే దిశగా ఉంటుందా లేక మిలియనీర్లు, బిలియనీర్లు అయ్యే విధంగా ఉం టుందా? ఈ అభివృద్ధి వ్యూహం ఆదాయ అసమానతలను పేదరి కాన్ని, కుల,మత, వివక్షతను ఆకలిని అన్యాయాన్ని తొలగించే విధంగా ఉంటుందా.పెరిగిన సంపద ఏవిధంగా పంపిణీ జరుగు తుందో వేచి చూడాలి. ●

07ATP27.qxd:07ATP27.qxd 07/09/22 10:44 PM Page 1



# పీయం కిసాన్ లబ్దిదారులు ఈకేవైసీ తప్పక చేయించుకోవాలి

-అవగాహన కార్యక్రమాల్లో ఏఓ శశికళ



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న మండల వ్యవసాయశాఖ అధికారి శశికళ దృశ్యాలు



**ఉరవకొండ, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

పీయం కిసాన్ లబ్దిదారులు ఈనెల 7వ తేదీలోగా రైతు భరోసా కేంద్రం లేదా, గ్రామ సచివాలయాలు, మీసేవ కేంద్రాలు, వాలంటీర్లవద్ద తప్పక ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి శశికళ సూచించారు. మంగళవారం ఆమె మండల పరిధిలోని చిన్నముష్టూరు, ఆమిద్యాల, రాకెట్ల, పెద్దకౌకుంట్ల గ్రామాల్లో పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వాలంటీర్లు, రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ పీఎం కిసాన్ చేయించుకోని వారు పీఎం కిసాన్ పథకంతోపాటు రైతు భరోసాకు కూడా అర్హత కోల్పోతారన్నారు. ఈ-పంట నమోదు చేసుకోని రైతులు వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# గొడవలకు తావులేకుండా అన్నదమ్ముల్లా ఉండండి

-వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వై.మధుసూదన్‌రెడ్డి

-రాకెట్లలో ఎస్సీ, బీసీ వర్గాలతో వేరువేరుగా సమావేశాలు



సోమవారం రాత్రి బీసీలతో మాట్లాడుతున్న వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వై.మధుసూదన్‌రెడ్డి

**ఉరవకొండ, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

గ్రామంలో గొడవలు, ఘర్షణలకు తావులేకుండా అన్నదమ్ముల్లా మెలగాలని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వై.మధుసూదన్‌రెడ్డి ఇరువర్గాలను



గ్రామంలోని ఎస్సీలతో సమావేశమై మాట్లాడుతున్న వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వై.మధుసదూన్‌రెడ్డి

సూచించారు. వినాయక నిమజ్జనం సందర్బంగా ఈనెల 4వ తేదీన మండల పరిధిలోని రాకెట్ల గ్రామంలో ఎస్సీ, బీసీ వర్గాల మధ్య ఘర్షణ చెలరేగిన నేపథ్యంలో పోలీసుల విజ్ఞాపన మేరకు సోమవారం రాత్రి ఆయన తన స్వగ్రామమైన రాకెట్లకు చేరుకొని బీసీ వర్గీయులతోనూ, మంగళవారం ఉదయం ఎస్సీ వర్గీయులతో వేరు వేరుగా సమావేశమై సయోధ్య కుదర్చడానికి ప్రయత్నించారు. గ్రామంలో ఇదివరకు ఎన్నడూ లేనివిధంగా గొడవలు చెలరేగడం బాధ కలిగిస్తోందని ఏవైనా సమస్యలు ఉంటే కూర్చొని మాట్లాడుకొని పరిష్కరించుకోవాలిగాని ఇలా గొడవ పడటంవల్ల గ్రామంలో ప్రశాంత వాతావరణానికి భంగం ఏర్పడుతుందని గ్రహించాలని ఆయన ఇరు వర్గాలను సూచించారు. అయితే బీసీ వర్గీయులు సయోధ్యకు అంగీకరించినా ఎస్సీ వర్గీయులు విముఖత చూపినట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.

# విషజ్వరాలపై అవగాహన కల్పిస్తున్న జోనల్ సబ్ యూనిట్ ఆఫీసర్ అబ్దుల్ ఖాదర్



విషజ్వరాలపై అవగావాన

**శెట్టూరు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

శెట్టూరు మండల పరిధిలోని కనకూరు గ్రామంలో మంగళవారం విషజ్వరాలపై జోనల్ ఆఫీసర్ అబ్దుల్ ఖాజర్ అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పర్యటించి ఈ సీజన్‌లో విషజ్వరాలు అధికంగా ప్రభలే అవకాశం ఉందని అన్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతే పాటించాలని దోమతెరలను వాడాలని సూచించారు. పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని అన్నారు. సాయంకాలం పూట వేపాకు పొగను వేసుకోవాలని అన్నారు. ఆశావర్కర్లు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి జ్వరాలను గుర్తించి పై స్థాయి అధికారుల దృష్టికి తీసుకురావాలని అన్నారు. వారానికోసారి నీటి తొట్టెలను శుభ్రం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి హరిత, ఏఎన్ఎం చంద్రప్రభ, సర్పంచు కావేరమ్మ, యంపిటిసి నాగమణి, ఆశావర్కర్లు, ఈరమ్మ, నింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థి తప్పక ఇంటర్న్‌షిప్‌లో పాల్గొనాలి

-అవగాహన కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా॥జి.రామకృష్ణ




విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జి.రామకృష్ణ

**ఉరవకొండ, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :**

ప్రతి విద్యార్థి తప్పకుండా ఇంటర్న్‌షిప్‌లో పాల్గొనాలని కళాశాల ప్రిన్సిపాల్ డా॥జి.రామకృష్ణ సూచించారు. పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఇంటర్న్‌షిప్‌పై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉన్నత విద్యలో భాగంగా చేపట్టిన సంస్కరణలలో ప్రతి విద్యార్థి కమ్యూనికేషన్ సర్వీస్ ప్రాజెక్టు, ఇంటర్న్‌షిప్ తప్పనిసరిగా చేయాలన్నారు. ప్రస్తుతం డిగ్రీ ద్వితీయ ఏడాది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఇంటర్న్‌షిప్ చేయాలని పేర్కొన్నారు. ఈ ఇంటర్న్‌షిప్ వల్ల విద్యార్థులకు పరిశ్రమలతో అవినాభావ సంబంధం ఏర్పడుతుందని తద్వారా వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. త్వరలో డిగ్రీ కళాశాల నుంచి 260 మంది విద్యార్థులు వివిధ కంపెనీలు, సంస్థల్లో ఇంటర్న్‌షిప్ చేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. విద్యార్థులకు కేటాయించిన సంస్థలలో విద్యార్థులు ప్రణాళిక బద్ధంగా పనిచేస్తూ తమ నైపుణ్యాలను భవిశత్తు ఉపాధికి అనుగుణంగా వృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా యస్.రామచంద్రారెడ్డి జయంతి వేడుకలు

- మహిళలకు చీరలు పంపిణీ -నివాళులు అర్పించిన తేదేపా రాష్ట్ర కార్యనిర్వహాక కార్యదర్శి సవిత



నివాళులు అర్పిస్తున్న సవిత, తేదేపా నాయకులు

**పెనుకొండ, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

మాజీ మంత్రి ఎస్.రామచంద్రారెడ్డి జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెలుగు దేశం పార్టీ రా ష్ట్ర కార్యనిర్వహాక కార్యదర్శి సవిత పెనుకొండ మండలం రాంపురం వద్ద ఉన్న మాజీ మంత్రి రామచంద్రారెడ్డి ఘాట్ వద్దకు చేరుకుని పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం రాంపురం పంచాయితీ చెర్లోపల్లి గ్రామంలోని మహిళలందరికీ సవత చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో



మహిళలకు చీరలు అందజేస్తున్న దృశ్యం

వెంకటేశ్వరరావు, నాగరాజు, మాజీ జడ్పిటిసి, రాంపురం సర్పంచు శ్రీనివాసులు, నాయకులు మాధవనాయుడు, మాజీ జడ్పిటిసి రంగేపల్లి వెంకటరమణ, వాల్మీకి రాష్ట్ర కన్వీనర్ ఈశ్వరయ్య, తలారి ఈశ్వరయ్య, గుట్టూరు మాజీ సర్పంచు సూర్యనారాయణ, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, పార్లమెంట్ కార్యదర్శి నీరుగంటి చంద్ర, శ్రీధర్‌స్వామి, మాజీ మండల కన్వీనర్ శ్రీరాములు, నాగార్జున, రవికుమార్, సిపిఐ నాయకులు శ్రీరాములు, వాసుదేవరెడ్డి, రమేష్‌నాయుడు, రాంపురం అంజి, మరువపల్లి నరసింహులు, రాము, శ్రీరాములు, ఆనంద్, ముత్యాలనాయక్, అంజినాయక్, హనుమంతునాయక్, నారాయణనాయక్, శెట్టిపల్లి మంజు, ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్టు డైరెక్టర్లు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

# చిత్రావతిలో జారిపడి జనసేన చేనేత విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మృతి

కాపాడాలని చూసినా ప్రయోజనం శూన్యం



మృతిచెందిన అమరేష్

**బత్తలపల్లి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

మండలంలని సంఘమేశ్వర క్షేత్రానికి వచ్చిన జనసేన చేనేత విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు చిత్రావతిలో స్నానానికి వెళ్లి జారిపడి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని శివానగర్‌కు చెందిన అమరేష్(35) జనసేన చేనేత విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పనిచేస్తున్నాడు. మంగళవారం మిత్రులతో కలసి సంగమేశ్వర క్షేత్రంలోని గుడకి వచ్చినట్లు తెలిపారు. చిత్రావతిలో స్నానానికి వెళ్లి పొరపాటున జారిపడి నీటి ప్రవాహానికి కొట్టుకుపోయాడు. మిత్రులు వెంటనే బత్తలపల్లి ఎస్ఐ శ్రీహర్షకు తెలపగా ఆయన సంగాల సర్పంచు రాజశేఖర్‌రెడ్డికి విషయం తెలియజేశాడు. సర్పంచు గ్రామస్థులతో వచ్చి ఏటికి ఎవురుంఎల్లి జారిపడిన వ్యక్తని ప్రాణాలతో రక్షించాలనా చూసారు. అయితే గ్రామస్థులకు దొరికే సమయానికే అమరేష్ మృతిచెందినట్లు తెలిపారు. విషయం తెలిపిన వెంటనే అమరేష్‌ను కాపాడానికి వచ్చిన సర్పంచుకు అయన కృతజ్ఞుతలు తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె వున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# కర్ణాటక మద్యం స్వాధీనం

**రామగిరి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** మండలంలోని కర్ణాటక సరిహద్దున మద్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా ఇరువురిని పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వద్ద 980 మద ంయ పాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జనార్ధన్‌నాయుడు తెలిపారు. ఈ మేరకు సరిహద్దులో వాహనాలను తనిఖీలు నిర్వహిస్తుండగా చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామానికి చెందిన నరసింహులు, ధర్మవరం కేతిరెడ్డికాలనీకి చెందిన శివయ్యలు ద్విచక్ర వాహనంలో కర్ణాటక మద్యం తరలిస్తుండగా వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 980 మద ంయ పాకెట్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపరాఉ. అనంతరం వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నామని ఎస్ఐ తెలిపారు.

# రెండు దేవాలయాల్లో చోరీ

**రామగిరి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :**

మండల కేంద్రమైన రామగిరిలోని గంగమ్మ దేవాలయం, నసనకోట సమీపంలోని దుర్గమ్మ దేవాలయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు చొరబడి చోరీ చేశారు. గంగమ్మగుడి కమిటీ సభ్యులు తెలిపిన వివరాలమేరకు.. ప్రతి రోజులాగే సాయంత్రం గంగమ్మగుడికి తాళం వేసి వెళ్లాం. అయితే సోమవారం రాత్రి గుడికి ఉన్న తాళాలను పగలగొట్టి లోపలికి ప్రవేశించి వెండి వడ్డానం, రెండు బంగారు తాళిబొట్లు, ఒక బంగారు నుదిటిబొట్టు, కనుబొమ్మలు, హుండీ చోరీ చేశారు. దీనిపై రామగిరి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్లూస్‌టీంను పిలిపించి వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అదే విధంగా నసనకోట సమీపంలోని దుర్గమ్మదేవాలయంలో కూడా చోరీ జరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. అమ్మవారి కిరీటం, కనుబొమ్మలు, వెండి ఆభరణాలు, దాదాపు కిలో వెండి చోరీ అయినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ చోరీపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు చేయలేదు.

# కోరేవు గ్రామంలో మారెమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ



మారమ్మ ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ దృశ్యం

**అమరాపురం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :**

మండల పరిధిలో హేమావతి గ్రామ పంచాయతీ కోరేవు గ్రామంలో నిర్వహించిన మారెమ్మ అమ్మవారి ఉత్స వాల్లో మాజీ ఎమ్మెల్సీ టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి మంగళవారం హాజరైయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు రిటైర్డ్ ఎస్ఐ రంగస్వామి, న్యాయవాది రంగస్వామి, గొల్ల మారన్నపల్లి రామంజినరావు తదితురల ఆహ్వానం మేరకు విచ్చేసి ప్రత్యేక పూజల్లో పాల్గొని వారు ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ నియోకవర్గ అధ్యక్షులు జయకుమార్, మాజీ ఎంపీటీసీ శివకుమార్, ఎంపీటీసీ ఓంకార్‌స్వామి,శ్రీనివాస్, మాజీ సర్పంచ్ కుమారస్వామి తదితరుల సమక్షంలో మాజీ ఎమ్మెల్సీకి సన్మానించారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కోవిడ్ వాక్సినేషన్

-83 మంది విద్యార్థులకు వాక్సిన్ బూస్టర్ డోస్

**ఉరవకొండ, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రి ద్వారా కళాశాల ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కోవిడ్ వాక్సినేషన్ కార్యక్రమం జరిగింది. వాక్సినేషన్ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డా॥జి.రామకృష్ణ ప్రారంభించగా 83 మంది విద్యార్థులకు వాక్సిన్ కోవీషీల్డ్, కోవాగ్జిన్ బూస్టర్ డోస్ అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి, అధ్యాపకులు తప్పక బూస్టర్ డోస్ వేయించుకోవాలని పిలుపునిచ్చారు. వాక్సిన్ వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వైఆర్‌సీ కో ఆర్డినేటర్ నాగజ్యోతిర్మయి. ఎన్ఎస్ఎస్ అధికారులు వెంకటరాముడు, అల్తాఫ్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా మారిన విద్యుత్ తీగలు

**చిలమత్తూరు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

మండలంలోని కనిశెట్టిపల్లి గ్రామంలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. కంసల ఈశ్వరమ్మ ఇంటి పక్కన వున్న విద్యుత్ స్తంభంకు ముళ్లచెట్లు, పొదలు విద్యుత్ తీగలకు అలముకున్నాయి. అసలు విద్యుత్ తీగలు కనబడని అంతగా తీగలు చుట్టుకున్నాయి. నిత్యం ఇదే దారిలో ప్రయాణీకులు వెళుతుంటారు. పాడిపశువులు సైతం మేత కోసం అటుగా వెళుతుంటాయి. అంతేకాకుండా వర్షం వచ్చినప్పుడు విద్యుత్ తీగలు ఒకదానికొకటి రాపిడితో నిప్పును రాజేస్తూ ప్రమాదకర పరిస్థితులు నెలకొంటున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి విద్యుత్ తీగలకు పెనవేసుకున్న ముళ్లకంపులు, చెట్ల తీగలను తొలగించి ఎలాంటి ప్రమాదం వాటిల్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఇష్టపడి చదవండి.. ఉన్నత శిఖరాలు అధిరోహించండి

- తేదేపా రాష్ట్ర కార్యనిర్వహాక కార్యదర్శి సవిత



డైరీలు అందుకున్న విద్యార్థులతో సవిత

**పెనుకొండ, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహాక కార్యదర్శి సవిత పేర్కొన్నారు. పెనుకొండ మండలం మావటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 200 మంది విద్యార్థులకు ఆమె డైరీలను అందజేశారు. అదే విధంగా పదవ తరగతి ఫలితాలలో ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధించిన ఇద్దరు



ప్రథమ స్థానం సాధించిన విద్యార్థికి నగదు పంపిణీ చేస్తున్న దృశ్యం

విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10,116లు నగదు బహుమతి అందించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ.. ఉన్నత చదువులు చదివి కన్న తల్లి దండ్రులను గురువులకు పేరు ప్రతిష్టలు తేవాలని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సింగిల్ విండో అధ్యక్షులు ఆంజినేయులు, గుట్టూరు మాజీ సర్పంచు సూర్యనారాయణ, నాగార్జున మావుటూరు గోపాల్ మావుటూరు ఎంపిటిసి ముద్దన్న, వాసుదేవరెడ్డి, గోపాల్ మేకల పల్లి ఆది, ముద్దన్న, గోపాల్‌రెడ్డి, ఎంపిటిసి నరసింహప్ప, నరేష్, నాగప్ప, నారాయణ, చౌడప్ప, మారుతి, మంజునాథ్, తిరుపతి, లక్ష్మికాంత్‌హరీష్, నరేష్, అంజి, గోవిందప్ప, అంజి , మారుతి, జనార్ధన్, నరేష్, మురళీ, వెంకటప్ప పెద్ద ఎత్తున మావటూరు టీడీపీ నాయకులు యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మున్సిపల్ ఉపాధ్యాయుల రాష్ట్రస్థాయి సదస్సు జయప్రదం చేయండి

- యుటిఎఫ్ నాయకులు

**అనంతపురం న్యూటౌన్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

స్థానిక యుటిఎఫ్ ఆఫీస్ అనంతపురంలో జిల్లా అధ్యక్షులు గోవింద రాజులు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం విజయవాడలో ఈ నెల 10వ తేదిన శనివారం జరిగే మున్సిపల్ టీచర్స్ రాష్ట్రస్థాయి సదస్సుకు మన జిల్లా నుంచి అత్యధిక సంఖ్యలో ఉపాధ్యాయులు, ముఖ్యంగా మున్సిపల్ ఉపాధ్యా యులు పాల్గొని జయపద్రం చేయాలని కోరారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప మాట్లాడుతూ.. మున్సిపల్ టీచర్ల సర్వీసుల పర్యవేక్షణ పరిపాలనాధికారాలు జీవో నెంబర్ 84 ద్వారా పాఠశాల విద్యాశాఖకు బదలాయించబడ్డాయి. అయితే మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు అనేకం పరిష్కారానికి నోచుకోలేదన్నారు. వాటిని వెంటనే పరిష్కరించాలని డిమాదండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు రమణయ్య, సహాధ్యక్షురాలు సరల, జిల్లా కార్యదర్శిలు ప్రమీళ, అర్జున్, హనుమంతరెడ్డి, రాఘురామయ్య, నాగరాజు, సంజీవ్ కుమార్, రవికుమార్, రాష్ట్ర కౌన్సిలర్లు ఈశ్వరయ్య, సుధాకర్, దేవేంద్రమ్మ, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ అబ్దుల్ వహబ్, ఆడిట్ సభ్యులు వెంకట్రామిరెడ్డి, శ్రీరాములు, రాజేంద్ర, సుబ్బరాయుడు, గోపాల్, ఓబులేసు, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

# 12లోపు దృవపత్రాలతో అడ్మిషన్ పొందాలి

**అనంతపురం న్యూటౌన్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

విద్యాహక్కు చట్టాన్ని అనుసరించి 12(1)(సి) సెక్షన్ల ప్రకారం 1వ తరగతిలో ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశం కల్పిస్తూ ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సిందిగా భ్రుత్వం వారు తెలియజేశారు. ఈ మేరకు, ఇది వరకే దరఖాస్తు చేసుకున్న వారిని లాటరీ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేసి 142 మంది విద్యార్థులకు 1వ తరగతిలో అడ్మిషన్ కొరకు జాబితాను సంబంధిత పాఠశాలకు (ఎంఇఓల ద్వారా) పంపడమైందన్నారు. కావున విద్యార్థుల తల్లిదండ్రులు మీకు కేటాయించిన పాఠశాలలో సంబంధిత దృవ పత్రాలతో హాజరై 12లోపు తమ అడ్మిషన్‌ను దృవీకరించుకుని పాఠశాలలో చేర్చవలసిందిగా తెలియజేశార. 12తేదీలోపు చేరని విద్యార్థుల అడ్మిషన్ రద్దు కాబడునని గమనించాలన్నారు.

# వాహనముల బహిరంగ వేలం

**అనంతపురం క్రైం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

అనంతపురం నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరములలో పట్టుబడిన 3 ద్విచక్ర వాహనాలను, రెండు కార్లను 9వ తేదిన శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ అనంతపుంర ఆధ్వర ంయలో అనంతపురం 4వ పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణంలో బహజరంగ వేలం వేయబడునని, ఆసక్తి కలవారు 3వేలు ధరావత్తు రుసుమును చెలి ంచి వేలం లోపాల్గొనవచ్చని సిఐ జాకీర్ హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# పలు గ్రామాల్లో పర్యటించిన బిజెపి నేతలు



బిజెపి కార్యకర్తలతో మాట్లాడుతున్న నాయకులు

**శింగనమల, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

జిల్లా బిజెపి అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసులు రాష్ట్ర కార్యదర్శి కనంపల్లి చిరంజీవిరెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం పుట్లూరు, తక్కళ్లపల్లి, శనగలగూడు, చింతకుంట, కడవక ల్లు, రామలింగయ్యపల్లి, మడ్డి పల్లి, ఎల్లుట్ల, శింగనమల తది తర గ్రామాల్లో బిజెపి నేతలు పర్యటించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాపోరు యాత్రలో భాగంగా నియోజకవర్గ యాత్ర ఇన్‌చార్జ్ డా.కోనంకి శ్రీధర్, కోఆర్డినేటర్ సాకే శివశంకర్, ఎస్సీ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజా, ఓబిసి మోర్చ జిల్లా కార్యదర్శి గంగాధర్, వడ్డే రాజులు, పుట్లూరు మండల అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, కిసాన్ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, రామాంజియాదవ్, రామ్మోహన్, నంజుండరావు తదితరులు గ్రామగ్రామన తిరిగి కార్యకర్తలను కలిశారు.

# రైతు భరోసాకు ధరఖాస్తు చేసుకోండి

**శింగనమల, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం మరోసారి అవకాశం ఇచ్చిందని మండల వ్యవసాయ అధికారి చిన్నమ్మ పేర్కొన్నారు. మంగళవారం ఆమె పత్రికా ప్రకటన విడుదల చేస్తూ ఇంత వరకు అప్లై చేసుకోని వారు ఎవరైనా ఉంటే, కొత్తగాపాస్‌బుక్కు లేదా 1బి వచ్చిన వారు రైతు భరోసా కేంద్రం అధికారిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఇందు కోసం పట్టాపాసుబుక్కు లేదా 1బి ఆధార్‌కార్డు జెరాక్స్, బ్యాంకు అకౌంట్ జెరాక్స్, ఫోన్ నెంబర్ రైతులు తెచ్చుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

**నేడు పిఎం కిసాన్ ఇకెవైసికి చివరి రోజు..** కేంద్ర ప్రభుత్వం రైతుల ఖాతా ల్లోకి ప్రతి సంవత్సరం జమా చేస్తున్న 6వేలు పిఎం కిసాన్ సమ్మాన్‌నిధి కొరకు ఇకెవైసిని చేయించుకునేందుకు నేడు చివరి రోజు అని అర్హత ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా ఇకెవైసిచేయించుకోవాలని అందుకు సంబంధించిన పత్రాలు తీసుకుని గ్రామ సచివాలయంలోని డిజిటల్ అసిస్టెంట్ లేదా మీసేవ లో ఇకెవైసి చేయించుకోవాలన్నారు. అలా చేయించుకోని పక్షంలో పిఎం కిసాన్ ద్వారా లబ్ధి పొందే రైతులు నష్టపోతారని కావున ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె పేర్కొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలు



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

**శింగనమల, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని చిన్నకా లువ వీధి అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికా హార వారోత్స వాల సందర్భంగా మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్త ప్రమీళ ఆధ్వర్యంలో ఈసిడె అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం లో గర్భవతులు, బాలింతలు, కౌమార దశ పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం జరగాలి

## -ఇన్‌చార్జ్ డిఎస్‌పి రమాకాంత్


సమావేశంలో మాట్లాడుతున్న డిఎస్‌పి

**హిందూపురం, సెప్టెంబర్ 6 ప్రభాత వార్త :** పట్టణంలో ఈ నెల 8వతేదీన జరిగే వినాయక నిమజ్జనం ప్రశాంత వాతావరణంలో జరిగేలా పట్టణ ప్రజలు సహకరించాలని పెనుకొండ ఇన్‌చార్జ్ డిఎస్‌పి రమాకాంత్ తెలిపారు. వినాయక నిమజ్జనం సందర్భంగా మంగళవారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మున్సిపల్ కమీషనర్ వెంకటేశ్వరరావు, ఒకటవ పట్టణ సిఐ ఇస్మాయిల్, ఇన్‌చార్జ్ తహశీల్దార్ నాగరాజు, ఇతర అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. వినాయకుని ఊరేగింపులో ఇతర మతాలు, కులాల వారు వ్యతిరేక నినాదాలు చేయడం, పేలుడుశబ్దాలు, అనుచితప్రదర్శనలు, అసభ్యకరమైన నాట్యాలు చేయరాదన్నారు. అధికారుల ఆదేశాల మేరకు నిర్ధేశించిన రూట్ మ్యాప్ ప్రకారం నిమజ్జనం సమయంలో నిబంధనలు పాటించాలని అధికారులు పేర్కొన్నారు. నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డిఎస్‌పి తెలిపారు.

# వైసిపి ప్రభుత్వంలో సామాన్యుడి బతుకు భారం

## -బాదుడే, బాదుడు కార్యక్రమంలో పరిటాల శ్రీరాం


బాదుడే, బాదుడు కార్యక్రమంలో మహిళలకు వివరిస్తున్న పరిటాల శ్రీరాం

**బత్తలపల్లి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వ పాలనలో సామాన్యుడు బతకలేని స్థితిలోకి వెళ్లిపోయాడని ధర్మవరం నియోజగకవర్గ ఇంచార్జ్ పరిటాల శ్రీరాం విమర్శించారు. మంగళవారం మండలంలోని లింగారెడ్డిపల్లి, యర్రాయిపల్లి, సంజీవపురం గ్రామాలలో బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా హాజరైన ఆయన ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెట్టారు. గత మూడేళ్లుగా ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. భారీ వర్షాలకు పంటనష్ట పోయిన రైతులను ప్రభుత్వమే ఆధుకోవాలన్నారు. రాష్ట్రంలో నాటి టిడిపి ప్రభుత్వంలో ధరలు అందుబాటులో వుండేవన్నారు. నేడు నిత్యావసర వస్తువుల ధరలు ముట్టుకుంటే షాక్ కొట్టేటట్లు వున్నాయన్నారు. దీంతో సామాన్యుడు కొనలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. వైకాపా పాలనలో అన్ని వర్గాల వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులకు సైతం ఎటువంటి సాయం అందడం లేదన్నారు. జిల్లాలో చాలా చోట్ల వర్షం కారణంగా పంటలు నష్టపోతే పరామర్శించే నాధుడే లేడన్నారు. ఇటువంటి సమయంలో కూడా ప్రభుత్వం ఆదుకోకపోతే ఇంకెప్పుడు ఆదుకుంటారన్నారు. అంతకు ముందు ఆయా గ్రామాలకు శ్రీరాం వచ్చినపుడు టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన కాటకోటేశ్వరక్షేత్రంలో పూజలు నిర్వహించిన గ్రామాలలోని ఇంటింటికి వెళ్లి బాదుడే, బాదుడు కార్యక్రమం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణరెడ్డి, నాయకులు చల్లా శ్రీనివాసులు నాయుడు, నెట్టెం రమణ, అయ్యప్ప, కేశవరెడ్డి, సుబ్బరాయుడు,, సురేంద్ర, గంటాపురం జగ్గు, కమతం మోహన్,గోనుగుంట్ల అమర్నాధ్‌చౌదరి, రంగానాయుడు, సతీష్, రాఘువంపల్లి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


శ్రీరాంకు పూలమాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు

# ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువతి మృతి

**బత్తలపల్లి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** అనారోగ్యంతో బాధపడుతూ ఎలుకల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యవతి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని పోట్లమర్రి గ్రామానికి చెందిన రవీంద్రగౌడ్, చూడామణి దంపతుల కుమార్తె జాహ్నవి(18) ధర్మవరంలోని ప్రైవేటు కళాశాలలో డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతోంది. గత రెండు సంవత్సరాలుగా మానశికంగా అనారోగ్యంతో బాధపడుతుండగా అనంతపురం లో ని ఆసుపత్రిలో చికిత్సలు చేయించుకుంటుండేదన్నారు. ఎంత ఖర్చు చేసి వైద్యం చేయించుకున్నా ఆరోగ్యం బాగుపడక పోవడంతో ఆదివారం సాయంత్రం ఎలుకల మందు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందన్నారు. అపస్మారక స్థితిలో వున్న జాహ్నవిని కుటుంభసభ్యులు వెంటనే ఆర్డీటి ఆసుపత్రికి తరలించారు. ప్రధమ చికిత్స అనంతరం అనంతపురం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఎంపిడిఓగా సాయిమనోహార్


ఎంపిడిఓగా బాధ్యతలు స్వీకరించిన సాయి మనోహార్

**బత్తలపల్లి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** బత్తలపల్లి మండలపరిషత్ అభివృద్ధి అధికారిగా సాయి మనోహార్ బాధ్యతలు చేపట్టారు. మంగళవారం స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో ఆయన ఇంచార్జ్ ఎంపిడిఓ శ్రీదేవి నుండి బాధ్యతలు స్వీకరించారు. ఆయన గుత్తి కో ఆపరేటివ్ బ్యాంకులో ప్రత్యేకాధికారిగా విధులు నిర్వర్తిస్తూ గ్రూప్ 1లో ఉత్తీర్ణత సాధించి ఎంపిడిఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో మండలాన్ని అభివృద్ది చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఎంపిడిఓగా బాధ్యతలు స్వీకరించిన ఆయనను సూపరిండెంట్ శ్రీదేవి, కార్యాలయ సిబ్బంది కలసి శుభాకాంక్షలు తెలిపారు.

# ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తాం

**రామగిరి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఖాతాదారులకుమరిన్ని మెరుగైన సేవలందిస్తామని బ్యాంకు మేనేజర్ కెవిఎస్ భాస్కర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం మండల సరిహద్దులోని కంబదూరు మంలడం కురాకులపల్లి గ్రామంలో ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యత సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ.. జీవిత భీమా, రూపేకార్డు ద్వారా ప్రమాద భీమా, ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యం, ప్రధానమంత్రి జీవనజ్యోతియోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ఆటల్ పింఛన్ యోజన తదితర పథకాల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ హాసు, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాసులు, సిబ్బంది అంజి పాల్గొన్నారు.

# వైసిపి బిసిలను ఓటుబ్యాంకుగానే చూస్తోంది

## - నియోజకవర్గ ఇంచార్జ్ పరిటాల శ్రీరాం


నూతన కమిటీ సభ్యులతో ఇంచార్జ్‌పరిటాల శ్రీరాం

**బత్తలపల్లి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** రాష్ట్రంలో వైసిపి పార్టీ బిసిలను కేవలం ఓటుబ్యాంకుగానే చూస్తోందని, అయినా బిసిలు మాత్రం టిడిపితోనే వున్నారని నియోజకవర్గ ఇంచార్జ్ పరిటాల శ్రీరాం అన్నారు. మంగళవారం ధర్మవరం నియోజకవర్గ టిడిపి నూతన బిసి సెల్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిసిలను వైకాపా ప్రభుత్వం అన్ని రకాలుగా వంచించిందన్నారు. కార్పొరేషన్‌లు పెట్టి ఎం ప్రయోజనం చేకూర్చిందో తెలియరాలేదన్నారు. టిడిపి ప్రభుత్వంలో కార్పొరేషన్ ద్వారా కోట్ల రూపాయలు రుణం ఇచ్చామన్నారు. వైకాపా ప్రభుత్వం చేసిన మోసాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లాల్సిన బాధ్యత మీపైనే వుందని నూతన కమిటీ సభ్యులకు ఆదేశించారు. అనంతరం నూతన కమిటీని ప్రకటించారు. బిసి సెల్ అధ్యక్షుడిగా ఆత్మకూరు కురుబ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా ధర్మవరం బోయ అనంతయ్య, ఉపాధ్యక్షులుగా రేగాటిపల్లి ఉప్పర కిష్టప్ప, బోయ మండల నరసింహులు, ముదిగుబ్బ బోయ కిష్టప్ప, అధికార ప్రతినిధులుగా బోయ సాంబశివుడు, తొగట అనిల్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా చిల్లకొండయ్యపల్లి దూదేకుల రాజా, ధర్మవరం ఈడిగ రామినే గోవిందు, గొట్లూరు బోయ చిరంజీవి, కురుబ ప్రకాష్, డి.చెర్లోపల్లి గొల్ల శంకర, కార్యదర్శులుగా ముదిగుబ్బ బెస్త చంద్రశేనా, మలకాపురం కురుబ అక్కులప్ప, ధర్మవరం కుమ్మర చిరంజీవి, శివపల్లి వడ్డె హరినాథ్, సోషల్ మీడియా ప్రతినిధులుగా ధర్మవరం రజక సాయి ప్రకాష్‌లను నియమించారు. ఈ సందర్భంగా ఆయన నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. కమిటీ సభ్యులు పదవులుగా బావించకుండా బాధ్యత అని గుర్తెరిగి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ నారాయణరెడ్డి, నెట్టెం రమణ, అయ్యప్ప, సుబ్బరాయుడు, సురేంద్రనాయుడు, గంటాపురం జగ్గు, అమర్నాథ్ చౌదరి, కమతం మోహన్, రంగానాయుడు తదితరులు పాల్గొన్నారు.

# అసైన్డ్ భూములకు ధరఖాస్తు చేసుకోండి


అప్పరాశ్చెరువు గ్రామసభలో మాట్లాడుతున్న తహశీల్దార్

**బత్తలపల్లి, సెప్టెంబర్ 6 ప్రభాత వార్త :** మండలంలో అసైన్డ్ భూములు సాగు చేసుకునే రైతులకు పట్టాలు ఇచ్చేందుకు ధరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ యుగేశ్వరీదేవి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని దంపెట్ల, ఓబుళాపురం సచివాలయంలో ట్రైని డిప్యూటి కలెక్టర్ భవాని శంకరి ఆధ్వర్యంలో సర్పంచులు బండి సరస్వతి, చల్లా కరుణాకరనాయుడుల అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహాశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రభుత్వ భూమిలో సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారికి పట్టాలు పంపిణి చేస్తామన్నారు. ఈ గ్రామసభలో ఓబుళాపురంలో 8, దంపెట్లలో 16మంది రైతులు అర్జీలు ఇచ్చినట్లు తెలిపారు. వారి పేర్లను గ్రామసభలో చదివి వినిపించారు. ఏవైనా అభ్యంతరాలు, ఆక్షేపణలు వుంటే తెలియజేయాలనడంతో 37 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి గజ్జల వెంగళ్‌రెడ్డి, ఆర్‌ఐ చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

# బత్తలపల్లిలో నేత్రదాన పక్షోత్సవాలు


నేత్రదానం విశిష్టతను తెలియజేస్తున్న కంటివైద్యులు

**బత్తలపల్లి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** మండలకేంద్రంలోని ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహించారు. మంగళవారం వైద్యాధికారిణి తేజశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రముఖ కంటి వైద్యులు ఉరుకుందప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి శరీరంలో అత్యంత ప్రధానమైన భాగం కళ్లు అని, వాటని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపైన వుందన్నారు. మనిషి మరణానంతరం మరొకరికి కళ్లను దానం చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపవచ్చునన్నారు. వైద్యాధికారిణి మాట్లడుతూ ప్రస్తుతం ఎన్‌సిడి, సీడి సర్వే, అనీమియా ముక్త్‌భారత్, ఫ్రైడే డ్రైడే, , జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం, కోవిడ్ వ్యాక్సినేషన్ తదితర ప్రభుత్వం నిర్దేశించిన లక్షాలను ఆశాలు, ఎంఎల్‌హెచ్‌పి, ఏఎన్‌ఎంలు పూర్తీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఓ రాజశేఖర్, ఇతర ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటిలో చోరి.. 3 తులాల బంగారు, వెండి అపహారణ



ఇంటిలో దొంగతనం

**అమరాపురం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** మండల పరిధిలో పి. శివరం గ్రామంలో లేట్ శ్రీరామరెడ్డి భార్య నళినాక్షీ ఇంటిలో సోమవారం రాత్రి దొంగతనం జరిగింది. దీంతో దాదాపు 3 తులాల బంగారు. 200 గ్రామల వెండిని చోరికి గురైనట్లు బాధితురాలు తెలిపారు. స్థానిక ఎస్‌ఐ వెంకటేశ్వర్లకు తెలియడంతో తక్షణం సిబ్బంది పి. శివరం గ్రామానికి సందర్శించి చొరికి గురైన ఇంటిలో పరిశీలన చేశారు. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు శనివారం తన మనువరాలు పుట్టిన రోజు వేడుకల సందర్భంగా బెంగళూరుకు వెళ్లానన్నారు. మంగళవారం మధ్యాహ్నం వచ్చి చూడగా ఇంటిలోని వస్తువులు చెల్లా చెదరం అయ్యాయని.. అలాగే ఇంటిలో ఉన్న బంగారు, వెండి ఆభరణాలు చోరికి గురైయినట్లు బాధితురాలు తెలిపారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

# ఐచర్ వాహనం ఢీ కొని ఆవు మృతి

**చిలమత్తూరు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

మండలంలోని మరవకొత్తపల్లి గ్రామంలోని బిసి కాలనీవద్ద ఐచర్ వాహనం ఢీ కొన్న సంఘటనలో చంద్రాయప్ప అనే వ్యక్తికి చెందిన ఆవు మృతి చెందింది. విషయం తెలుసుకున్న చంద్రాయప్ప కన్నీరుమున్నీరయ్యాడు. తనకు ఐచర్ వాహనం డ్రైవర్ నష్టపరిహారం చెల్లించాలంటూ చంద్రాయప్పతో గ్రామస్తులు ఆందోళన చేశారు.


మృతి చెందిన ఆవు

# ఈ కేవైసి ప్రతి ఒక్కరూ చేయించుకోవాలి


ఈ కెవైసి చేయిస్తున్న వ్యవసాయాధికారి నటరాజ్ దృశ్యం

**కొత్తచెరువు, సెప్టెంబర్ 06, ప్రభాతవార్త :** మండల వ్యాప్తంగా ఇంకా ఈ కెవైసి చేయించుకోని వారు 2000ల మందికి పైగా ఉన్నారని, ఈ నెల 7వ తేది చివరి రోజు కావున ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఈ కెవైసి చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి నటరాజ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రమైన కొత్తచెరువులోని చరితా కామన్‌సర్వీస్ సెంటర్ (సిఎస్‌సి)ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ కెవైసి చేయించుకోని యెడలా కేంద్ర ప్రభుత్వం అందజేసే రూ.6000ల సహాయం అందదని, కావున తక్షణమే ఈ కెవైసి చేయించుకోని రైతులు చరిత కామన్ సర్వీస్ సెంటర్‌లో చేయించుకోవాలన్నారు.

# దివ్యాంగ విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ


దివ్యాంగ విద్యార్థినికి నోటు పుస్తకాలు అందిస్తున్న దృశ్యం

**కొత్తచెరువు, సెప్టెంబర్ 06, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన కొత్తచెరువులోని ఉర్దూ పాఠశాలలో మంగళవారం దివ్యాంగుల విద్యార్థినీ విద్యార్థులకు హెచ్ ఆర్ సి సి ఐ ఆధ్వర్యంలో నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. జాతీయ మానవహక్కుల పరిరక్షణ సంస్థ చైర్మన్ ఎస్‌వి రమణయ్య ఆదేశాల మేరకు హెచ్‌ఆర్‌సిసిఐ జిల్లా అధ్యక్షులు ఎం.జగదీష్ ఆధ్వర్యంలో ఉర్దూ పాఠశాలలో చదువుతున్న దివ్యాంగుల విద్యార్థినీ విద్యార్థులకు వీటిని పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.వి.పాపన్న, గిరిబాబు, శివయ్య, మునిస్వామి, ఓబులేసు, సాయిప్రసాద్, రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

# నేడు రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ వైస్ ఛైర్మన్ ఎం.వి.ఎస్.నాగిరెడ్డి పుట్టపర్తి రాక

**శ్రీసత్యసాయి జిల్లా, సెప్టెంబర్ 06, ప్రభాతవార్త**

ఈ నెల 07వ తేదిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అగ్రికల్చర్ మిషన్ వైస్ ఛైర్మన్ ఎ.వి.ఎస్.రెడ్డి పుట్టపర్తికి రానున్నట్లు మంగళవారం అధికార వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. 07వ తేది బుధవారం ఉదయం 07:30 గంటలకు అనంతపురం నుండి బయలుదేరిఉదయం 09:30 గంటలకు పుట్టపర్తి కలెక్టరేట్‌కి చేరుకుంటారని, అనరతం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 01:30 గంటల వరకు పుట్టపర్తి కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్‌తో కలసి అగ్రి మరియుఆయిల్డ్ సెక్టార్లకు చెందని రైతులు, శాస్త్రవేత్తలు, అధికారులతో ఇరిగేషన్ అగ్రికల్చర్ కోపరేషన్, ఫిషరీస్, హార్టికల్చర్, అనిమల్ హాస్బండరీ, సివిల్ సప్లైయిస్, ట్రాన్స్‌కో, ఎపి మార్కెటింగ్, డిసిసి బ్యాంకు ఛైర్మన్, జిల్లా లిడ్ మేనేజర్లతో సమీక్షించనున్నట్లు తెలియజేశారు. మధ్యాహ్నం 01:00 గంట నుండి 02:00 గంటల వరకు మీడియా ప్రతినిధులతో పత్రికా సమావేశం, అనంతరం మధ్యాహ్నం 02:30 గంటల నుండి పుట్టపర్తి నుండి బయలుదేరి కదిరి ఎఆర్‌ఎస్‌కు 03:15 గంటలకు చేరుకోనున్నట్లు, అక్క ఎఆర్‌ఎస్ పరిశీలన అనంతరం సాయంత్రం 06:00 గంటలకు కదిరి నుండి అనంతపురం బయలుదేరి వెళ్ళనున్నట్లు తెలియజేశారు.

# తెదేపా రాష్ట్ర బిసిసెల్ ప్రధాన కార్యర్శిగా ఎంపికైన జరిపిటి నరసింహులుకు సత్కారం

**శ్రీసత్యసాయిజిల్లా(వైద్యం), సెప్టెంబర్ 06, ప్రభాతవార్త**


జరిపిటి నరసింహులును సత్కరిస్తున్న వడ్డెర నాయకులు దృశ్యం

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శిగా పుట్టపర్తి నియోజకవర్గం నల్లమాడ మండలం, మసకవంకపల్లికి చెందిన జరిపిటి నరసింహులు ఎంపికవడంతో నియోజకవర్గ వడ్డెర నాయకులు మంగళవారం ఆయనను పుట్టపర్తిలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ, వడ్డెరలకు తెలుగుదేశం పార్టీలో మంచి గుర్తింపు ఉందని, కష్టపడి పనిచేసే వారికి పార్టీ పదువులు ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. తన ఎన్నికకు అహర్నిశలు కష్టపడిన మాజీ మంత్రి, పుట్టపర్తి నియోజకవర్గ తెదేపా ఇన్‌చార్జ్ డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డికి, నిమ్మల కిష్టప్పకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బిసి కులాలన్నింటిని ఏకం చేసి తెలుగుదేశం పార్టీ గెలుపునకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా జిల్లా వడ్డెర సాధికారసమితి అధ్యక్షులు పల్లపురవీంద్ర, పుట్టపర్తి నియోజకవర్గ వడ్డెర అధ్యక్షులు వలిపి శ్రీనివాసులు, నియోజకవర్గం ఐటిడిపి ప్రధాన కార్యదర్శి మంజునాథ్, ఎస్.సి.పెద్దన్న, శివశంకర్, శంకర నారాయణ, అమడగూరు రమణ, నడిపి పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

# సూపర్‌వైజర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

**కొత్తచెరువురూరల్, సెప్టెంబర్ 06, ప్రభాతవార్త :** శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోని మడకశిర, హిందూపురం, పెనుకొండ, సికెపల్లి, ధర్మవరం, కదిరి తూర్పు మరియు పడమర పరిదిలోని 7 ఐసిడిఎస్‌ప్రాజెక్టుల పరిధిలో 51 సూపర్‌వైజర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మహిళాశిశు సంక్షేమ మరియు సాదికారత అధికారిణి రెడ్డిరమణమ్మ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు. 01.07.2022 నాటికి 10 సంవత్సరాల సర్వీసు పూర్తీ చేసి, 50 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న ప్రతి అంగన్‌వాడీ కార్యకర్త(మేయిన్) అర్హులన్నారు. ఈ నెల 05వ తేది నుండి 12వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఇవ్వడం జరిగిందన్నారు. 12వ తేది సాయంత్రం 05 గంటల లోగా దరఖాస్తు చేసుకోవాలని, గడువు దాటిన పిమ్మట ఎట్టిపరిస్థితిల్లోను దరఖాస్తులు స్వీకరించబడవన్నారు. దరఖాస్తులు శ్రీసత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి ఎదరుగా ఉన్న సిడిపిఓ కార్యాలయంలో లభిస్తాయని, సిడిపిఓ కార్యాలయంలోనే దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఫోన్ నెంబర్ 7337243684కు సంప్రదించాలన్నారు. అభ్యర్థులు వారి విద్యార్హత, కులధృవీకరణ పత్రాలు, వయస్సు(టిసి), అదనపు విద్యార్హతలు, అంగన్‌వాడీ కార్యకర్త నియామకపు ఉత్తర్వుల జిరాక్స్ ప్రతిల యందు గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేయించి దరఖాస్తుకు జతపరచాలన్నారు.

# పుడా పరిధిలో లే ఔట్లకు అనుమతులు తప్పనిసరి

**శ్రీసత్యసాయి జిల్లా, సెప్టెంబర్ 06, ప్రభాతవార్త**

పుట్టపర్తి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (పుడా) పరిధిలోఉన్న నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఎక్కడ లే ఔట్లు వేయాలన్న పుడా అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని, ప్లాట్లు కొంటున్న ప్రజలువారు కొంటున్న లే ఔట్లకు అనుమతులు ఉన్నాయా? లేదా? అన్న విషయాన్ని తప్పనిసరిగా సరిచూసుకోవాలని పుడా వైస్ ఛైర్మన్ నరేష్‌కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యంగా అసైన్డ్ భూములలో లే ఔట్లు వేయడం చట్టరిత్యానేరమని, తక్కువ ధరకు దొరుకుతున్నాయి కదా అని కొనరాదని, పుడా అనుమతులు ఉన్న లే ఔట్ల నందు పార్కు, 40 అడుగుల రోడ్లు మొదలగు సదుపాయాలతో చట్టపరమైన రక్షణ ఉంటుందన్నారు. మధ్యతరగతి ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి స్మార్ట్ టౌన్‌షిప్ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని, ఈ పథకం క్రింద 60 నుండి 40 అడుగుల రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, వీధిదీపాలు, పార్కు, ఫుట్‌పాత్‌లు మొదలగు అత్యాధునిక సదుపాయాలతో ప్లాట్లను అభివృద్ధిపరచి అతితక్కువ ధరలకే మధ్య తరగతి ప్రజలకు విక్రయించడం జరిగిందన్నారు. వీటిని పుట్టపర్తిలో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ ఎంఐజి ప్లాట్లు అభివృద్ధి పరచనున్నామని, ప్లాట్లు కొనదలచిన వారికి ఇది సువర్ణ అవకాశమన్నారు.

# రీ సర్వే పూర్తి చేయుటలో బాధ్యతతో వ్యవహరించాలి- ఆర్డిఓ తిప్పేనాయక్


సమావేంలో మాట్లాడుతున్న ఆర్డిఓ తిప్పేనాయక్

**ధర్మవరం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** డివిజన్ పరిధిలోని ఏడు మండలాల్లోని గ్రామాలలో రీ సర్వే బాధ్యత వ్యవహరించి, విధులు సక్రమంగా నిర్వర్తించాలని ఆర్డిఓ తిప్పేనాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆర్డిఓ కార్యాలయంలో రీ సర్వేకు సంబంధించిన అంశాలపై డివిజన్ విలేజ్, టౌన్ సర్వేయర్లకు సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఆర్డిఓ మాట్లాడుతూ.. ఏడు మండలాలలో 94 రెవెన్యూ గ్రామాలు కలవని, 24 గ్రామాల్లో డ్రోన్ ప్లే సర్వే పూర్తి అయిందని, మిగిలిన 70 గ్రామాల్లో త్వరితగతిన పనులు పూర్తి చేయాలని తెలియజేశారు. ఇప్పటి వరకు డ్రోన్ ప్లేతో 10 గ్రామాలు రీ సర్వే పూర్తి చేయడం జరిగిందన్నారు. రామకృష్ణన్ ద్వారా ఈ శిక్షణలో పలు విషయాలను, తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. డ్రోన్ ప్లే జరిగిన తర్వాత ఓఆర్ఏ య్యాపులు వచ్చిన వెంటనే రీ సర్వేను పూర్తి చేసేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వం ఈ రీ సర్వేను ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిఐలు అంజప్ప, మురళీ కృష్ణ, శామ్యూల్‌బాబు, ఏడుమండలాల విలేజ్ సర్వేసులు 70 మంది పట్టణ మండల సర్వేయర్లు ఏడు మంది తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రిని, ఎమ్మెల్యేలను విమర్శించే స్థాయి చిలకం మధుసూధన్‌రెడ్డికి లేదు

## - రేగాటిపల్లి సర్పంచు సురేష్‌రెడ్డి


మాట్లాడుతున్న రేగాటిపల్లి సర్పంచు సురేష్‌రెడ్డి

**ధర్మవరం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని, స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని విమర్శించే స్థాయి చిలకం మధుసూధన్‌రెడ్డికి లేదని రేగాటిపల్లి సర్పంచు సురేష్‌రెడ్డి అన్నారు. మంగళవారం తన స్వగృహంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచు సురేష్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో నియోజకవర్గాలలో రౌడీ ఇజం, దందా అనేది ఎవరు చేశారు అన్నది ప్రజలకు బాగా తెలుసని, నీతి వ్యాఖ్యాలు మీ ద్వారా చెప్పించుకునేంత అవసరం మా వైఎస్‌ఆర్‌సిపి పార్టీకి లేదన్నారు. చిలకం మధుసూధన్‌రెడ్డి నీవు, రేగాటిపల్లి రచ్చబండకు మీరు సిద్దమా.. అని ఈ సందర్భంగా వారిని ప్రశ్నించారు. అనవసరమైన బురదను మా పార్టీమీద, ఎమ్మెల్యేల మీద చల్లడం తమరికి మంచిది కాదని హితవు పలికారు. మొదట నీవు రేగాటిపల్లిలో నీవు మంచి పేరు సంపాదించుకో తర్వాత మాట్లాడుకుందాం. అనవసరంగా మాట్లాడడం తగదని తెలిపారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి రేగాటిపల్లిలో ఈద్గాకు సహకరించాలని, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి బాట నడిపేందుకు ఎమ్మెల్యే కృషి చేయడం ప్రజలకు తెలుసునని,నియోజకవర్గం కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ఎమ్మెల్యే అయిన తర్వాత అభివృద్ధి బాటలో నడుస్తుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఇకనైనా ఇలాంటి మాటలు మానుకుని అభివృద్ధికి సహకరిస్తే బాగుటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపి టిసి రవీందర్‌రెడ్డి, నాయకులు కొండారెడ్డి, విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఫోర్‌మెన్ కమిటీ ముందు వాదనలు వినిపించిన "దుర్గం" నేతలు

## -అన్ని విన్న కమిటీ సభ్యులు అధినేతకు విన్నవిస్తామన్న వైనం

**కళ్యాణదుర్గం, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త :** కళ్యాణదుర్గం తెలుగుదేశం పార్టీలో అసమ్మతివర్గాలు ఫోర్‌మెన్ కమిటీ ముందు హాజరై తమ వాదనలు వినిపించినట్లు సమాచారం. ఈనెల 6వ తేదిన కమిటీ ముందు హాజరుకావాలని అధిష్టానం అదేశించిన నేపథ్యంలో ఇన్‌ఛార్జి ఉమామహేశ్వరనాయుడు, అసమ్మతివర్గాలకు చెందిన మాజీ ఎమ్మెల్యే రాష్ట్ర ఉపాధ్యక్షులు హనుమంతరాయచౌదరి, తనయుడు మారుతిచౌదరి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కంబదూరు కరణం రామ్మోహన్‌చౌదరి, సీనియర్ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మోరేపల్లి మల్లికార్జునలను విడివిడిగా విచారించిన కమిటీలో వారి అభిప్రాయాలను ప్రశాంతంగా విన్నట్లు సమాచారం, ఇన్‌చార్జి ఉమామహేశ్వరనాయుడుతో కూడా ప్రత్యేకంగా కమిటీ సమావేశమై చర్చించినట్లు సమాచారం. కమిటీ అమీతుమీ తేల్చకపోయినా అన్ని వివరాలను అధినేత చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళతామని పేర్కొన్నట్లు సమాచారం. అవసరమైతే మరోసారి కమిటితో చర్చించేందుకు రావాల్సి ఉంటుందని కూడా పేర్కొన్నట్లు సమాచారం. కమిటీతో చర్చల అనంతరం రెండు వర్గాలు తమ పట్ల సానుకూలంగా కమిటీ వ్యవహరించిందని, తమకు అనుకూలమైన రాజకీయ వాతావరుణమే ఉంటుందనే భావనలను వ్యక్తపరచడం విశేషం.

# ఘనంగా ఎమ్మెల్యే తనయుడు నందమూరి మోక్షజ్ఞతేజ జన్మదిన వేడుకలు

**చిలమత్తూరు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తనయుడు నందమూరి మోక్షజ్ఞతేజ జన్మదిన వేడుకలను మండల కన్వీనర్ రంగారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ రంగారెడ్డి పెట్రోల్‌పంపులో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ అశ్వత్థప్ప, నియోజకవర్గం కో ఆర్డినేటర్ విశ్వనాథ్‌రెడ్డి, టేకులోడు భైరవరెడ్డి, టిఎన్‌టియుసి నరేంద్ర, కోడూరు పంచాయతీ కన్వీనర్ మీసేవా సూరి, ఐటిడిపి మండల కో ఆర్డినేటర్ నాగరాజు, తెలుగుయువత మండల అధ్యక్షులు మల్లికార్జున, తెలుగుయువత కార్యదర్శి భాస్కర్, మైనార్టీ మండల అధ్యక్షులు కలిం, మగ్గం ఆదినారాయణ, భూసంద్రం నంజిరెడ్డి, యూనిట్ ఇన్‌చార్జ్ గంగాధర, రఘు, శేఖర్‌రెడ్డి, మైనార్టీ నాయకులు రహంతుల్లా, రఫిక్, ఐటిడిపి ఆదినారాయణ, మాజీ స్టోర్ డీలర్ ముద్దన్న, శంకరప్ప, ఆదినారాయణప్ప, ఎన్‌బికె రామాంజి, కృష్ణమూర్తి, పరిటాల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

05ATP06.qxd:05ATP06.qxd 07/09/22 10:23 PM Page 1



# వైఎస్ఆర్ రైతు భరోసా నమోదు ఇకెవైసి చేసుకోండి



శ్రీహరినాయక్

**తనకల్లు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్ఆర్ రైతు భరోసా నమోదు ప్రక్రియ 6 నుంచి ప్రారంభం అయిందని మండల వ్యవసాయ అధికారి శ్రీహరినాయక్ తెలిపారు. వైఎస్ఆర్ రైతు భరోసా–పిఎంకిసాన్ ద్వారా ఏటా విడతల వారీగా అందించడం జరుగుతోంది. ఇప్పటి వరకు ఒక్క విడత కూడా అందని రైతులు, కొత్తగా పాస్‌బుక్ చేయించుకున్న రైతులు ఎవరైనా ఉన్నచో, ఆయా రైతు భరోసా కేంద్రాలలో విఎఎ, విహెచ్ఎ, విఎస్ఎలను సంప్రదించి నమోదు చేయించుకోవాలని ఏఓ తెలిపారు. అదే విధంగా పిఎం కిసాన్ ఇకెవైసి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పిఎంకిసాన్ ద్వారా రైతులకు 2వేల చొప్పున ఏటా 6వేల పొదాలంటే ఇప్పటికే పిఎం కిసాన్ నమోదు అయిన రైతులందరూ, ఈ నెల 7తేదీలోపు తప్పనిసరిగా ఇకెవైసి చేయించుకోవాలని మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల పరిధిలో రైతులతో డోర్‌టూడోర్ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఏఓ తెలిపారు. ముందుగా తమకు అందుబాటోలు ఉన్న కామన్ సర్వీస్ షెంటర్, మీసేవా కేంద్రాలను సంప్రదించి, ఆధార్ ద్వారా బయోమెట్రిక్ వేసి ఇకెవైసి ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. స్మార్ట్ ఫోన్ ఉన్న రైతులు స్వయంగా తామే తన ఫోన్‌లో వెబ్‌సైట్ ద్వారా సెల్ నెంబర్ లింక్ ఉన్న ఆధార్ గల రైతులు ఓటిపి ద్వారా ఈకెవైసి ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. గడువు తేదీలోపు ఇకెవైసి చేయించుకోకపోతే పిఎం కిసాన్ పథకం లబ్దిని కోల్పోతారని ఏఓ శ్రీహరినాయక్, ఏఈఓ నయాజ్ తెలిపారు.

# ఉధృతంగా ప్రవహిస్తున్న వైబి హాళ్లి చెరువు వంక

**– దారి లేక జలదిగ్బంధంలో వైబి హాళ్లి**



రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తున్న వైబి హాళ్లి చెరువు వంక

**మడకశిర టౌన్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

మండల పరిధిలోని వైబి హాళ్లి చెరువు మరువ ప్రవహిస్తూ రెండు నెలలు కావస్తోంది. ఆ నాటి నుంచి నేటి వరకు కర్ణాటక ప్రాంతంలో వర్షం పడిన ప్రతిసారి ఈ చెరువు వంక ఉధృతంగా ప్రవహిస్తూ ఆ గ్రామానికి రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఎందుకంటే ఈచెరువుకు కర్ణాటకలోని 24 చెరువుల నీరు వచ్చి చేరుతుండటంతో పెద్ద ఎత్తున ప్రవహిస్తూ నది పరివాహక ప్రాతాన్ని తలపిస్తోంది. ఇంత పెద్ద ఎత్తున వంక ప్రవహిస్తున్న ఎత్తైన బ్రిడ్జిలు ఏర్పాటు చేయకపోవడంతో గ్రామస్తులకు ప్రతిసారి రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా కోనప్పపాలెం, కోడిపల్లి, వైబి హాళ్లి గ్రామాలకు చెందిన విద్యార్థులు ఉన్నత పాఠశాలలకు రావాలంటే ఈ వంక దాటుకొని రావాల్సి ఉంటుంది. ఎంతో కాలంగా అధికారులకు ప్రజా ప్రతినిధులకు తమ డిమాండ్ తెలియజేసినప్పటికీ వినూత్నంగా నిరసన కార్యక్రమాలు చేపట్టినప్పటికీ



వంకదాటడానికి ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు

అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించకపోవడం శోచనీయం. ఇటీవల నెల రోజుల క్రితం రోడ్లపై కంచవేసి నిరసన వ్యక్తం చేసి మా గ్రామంలోకి ఎవరూ రాకండి అని నిరసన వ్యక్తం చేసిన వైనం జిల్లా ఉన్నతాధికారులకు కూడా పట్టకపోవడం దురదృష్టకరం. జిల్లా కలెక్టర్ సైతం గుట్టు చప్పుడు కాకుండా వైబి హాళ్లి సచివాలయాన్ని తనిఖీ చేసి వెళ్లిపోయారే తప్పా గ్రామ పరిస ఇథతిని తెలుసుకోలేక పోయారు. ఇంత జరుగుతున్నా ఎమ్మెల్యే తిప్పేస్వామి సైతం స్పందించకపోవడం విశేషం. మరోవైపు జిల్లా గుంట మీదుగా భక్తరపల్లి వరకు తారు రోడ్డు నిరి ంమచినప్పటికీ వైబి హాళ్లి ఉన్నత పాఠశాల నుంచి గ్రామం వరకు తారు రోడ్డు కూడా నిర్మించలేదు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణంతోపాటు మడకశిర రోడ్డులోని వైబిహాళ్లి వంక వద్ద కల్వర్టును నిర్మించాలని అదే విధంగా వైబిహాళ్లి నుంచి బుడ్డయ్యపాళెం వెళ్లే రహదారిలో ట్యాంకు భావి వద్ద ఎత్తైన కల్వర్టు నిర్మించి రాకపోకలు వర్షాకాలంలో స్తంభించకుండా చూడాల్సిన పరిస్థితి ఉంది. రెండు నెలల్లో నాలుగు సార్లు ఈ చెరువు నీరు ఉధృతంగా ప్రవహాజంచడంతో ప్రవహించిన ప్రతిసారి రెండు రోజులపాటు రాకపోకలు స్తంభించిపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు సంఘటనా స్థలాన్ని గ్రహించి కల్వర్టు నిర్మాణంతోపాటు రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

# నియోజకవర్గంలోని టైలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**– ఎమ్మెల్యే వెంకటరమణప్ప**

కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెంకటరమణప్ప



**పావగడ, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

నియోజకవర ంలోని టైలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణప్ప హామీ ఇచ్చారు. మంగళవారం పావగడ తాలూకా టైలర్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఎస్‌కె బయలు రంగ మందిరంలో ఏర్పాటు చేసిన టైలర్ల సమావేవంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. టైలర్ల సమస్యల గురించి కార్మిక శాఖ మంత్రితో చర్చించి టైలర్లను కార్మికుల శాఖలో చేర్చేందుకు కృషి చేస్తానన్నారు. సముదాయ భవన నిర్మాణానికి నిధులనుకూడా మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తాలూకా టైలర్స్ అసోషియేషన్ అధ్యక్షులు కరయణ్ణ మాట్లాడుతూ.. రైతులు–టైలర్లు బొమ్మ బొరుసు లాంటి వారని రైతులు ఎదుర్కొంటున్నట్లే టైలర్లు కూడా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. తాలూకాలో 2000 మందికి ఉద్యోగ ఉపాధి కల్పించే విధంగా తాలూకాలో గార్మెంట్‌ను నిర్మించాలని కోరారు. అంతేకాక అసంఘటిత కార్మికుల సమాజిక భద్రతను రచించాలని, 60 సంవత్సరాలు పైబడి టైలర్ వృత్తి నుంచి నివృత్తి చెందిన వారికి నెలకు 3వేల రూపాయలు పింఛన్ ఇవ్వాలని, హెల్త్‌కార్డులతోపాటు ఈఎస్ఐ సౌలభ్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప, యస్‌స్‌కె సంఘం అధ్యక్షులు కెవి.శ్రీనివాస్, జెడిఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆర్‌సి.అంజినప్ప, బిజెపి నాయకులు కొత్తూరు హనుమంతరాయప్ప, నేరళకుంటె నాగేంద్రకుమార్, సాయిసుమన, టైలర్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి నారాయణప్ప, కోశాధికారి నరసింహామూర్తి, డిటి రసూల్, టైలర్ గోవిందప్ప, టి.ప్రతాప్, లక్ష్మిదేవి, సుమలత, సునందబాయి తదితరులు పాల్గొన్నారు. దాదాపు 2వేల మంది దాకా టైలర్లు సమావేశానికి హాజరయ్యారు.

# ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశం



ప్రాజెక్ట్ డైరెక్టర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**అమడగూరు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో డిడబ్ల్యుఎంఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ రామాంజినేయులు మంగళవారం ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నర్వహించారు. ఇందులో భాగంగా అమృత్ సరోవర్ పనులను పండ్లతోటల పెంపకం పనులను టిఎల వారిగా సమీక్ష చేసి పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా కూలీలకు పనులు కల్పించే విష యంలో ఎఫ్ఎల వారిగా సమీక్ష జరిపి కూలీలు వలస వెళ్లకుండా పనులు కల్పించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఒడిసి క్లస్టర్ ఎపిడి శ్రీనివాసులు, ఎపిడి అసిస్టెంట్ ప్రతాప్‌రెడ్డి, ఎంపిడిఒ నసీమా, ఎపిఒ అమ రావతి, ఇసిలు ఆనంద్, గంగాధర్, జిల్లా టెక్నికల్ అసిస్టెంట్ శివ, ప్రతాప్ రెడ్డి, ప్లాంటర్స్ సూపర్‌వైజర్ గంగాధర్, మంజునాథ, పురుషోత్తంరెడ్డి, వెంకటరమణ, అంజనప్ప, విశ్వనాథరెడ్డి, సిఒలు, ఎఫ్ఎలు పాల్గొన్నారు.

# ఫ్లోరోసిస్ బాధితులకు చేతి కర్రలు పంపిణీ



చేతికర్రలు అందచేసిన దృశ్యం

**అమడగూరు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

జాతీయ ఫ్లోరోసిస్ నివారణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం అమడగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ షిఫా సుల్తానా ఆధ్వర్యంలో ఫ్లోరోసిస్ బాధితులకు చేతి కర్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఫ్లోరోసిస్ ప్రభావిత ప్రాంతాలను గుర్తించడం జరిగిందన్నారు. ఇక్కడ గుర్తించిన ప్రభావిత ప్రాంతాల్లో సర్వే నిర్వహించి ముఖ్యంగా 3 నుండి 5 తరగతుల స్కూల్ పిల్లలకు మరియు పెద్దల కొరకు ఇంటింటికి సర్వే నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనిలో ముఖ్యంగా అస్థిపంజర వ్యవస్థకు సంబంధించి వివిధ పద్దతుల్లో సర్వే నిర్వహించి ఇందులో అనుమానాస్పదమైన కేసులను గుర్తించి వాటికి మూత్ర పరీక్షలు, రక్తపరీక్షలు చేయుటకు జిల్లా కేంద్రానికి పంపడం జరుగుతుందన్నారు. అవసరమైన వారికి పునరావాస సహాయాలు, చేతికర్రలు, నడుము బెల్టులు, మెడకు బెల్టులు, వాకర్లు అందచేస్తారన్నారు. వీరికి అవసరమైన మేరకు శస్త్ర చికిత్సలు కూడా చేయించవచ్చన్నారు. తాగునీటిలో ఫ్లోరైడ్ శాతం పరీక్షించి సంబంధిత అధికారులతో మాట్లాడి మెరుగైన తాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఫ్లోరైడ్ నివారణకు సంబంధించిన ఆహార పదార్థాలు ఏమేమి తీసుకోవాలన్న దానిపై అవగాహన కల్పించారు. ఇందులో అర్హులైన 16 మంది వృద్ధులకు చేతికర్రలు అందచేశారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది, ఆశాకార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# చినగానపల్లిలో గ్రామసభ

**అమడగూరు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**



గ్రామసభలు నిర్వహిస్తున్న దృశ్యం

మండలంలోని చినగాన పల్లి సచివాలయంలో మంగళవారం తహశీల్దార్ రెడ్డిశేఖర్ ఆధ్వర్యంలో సీనియర్ అసిస్టెంట్ వరిగిరెండి శ్రీనివాస్ రెడ్డి గ్రామసభలు నిర్వహిం చారు. గ్రామసభలో ఆయన రైతులతో మాట్లాడుతూ 5 ఎకరాలలోపు వున్న వారు కొన్ని సంవత్సరాల నుండి సాగు చేసుకుని పంట పెట్టుకుంటున్న అనుభవంలో బంజరు భూమిని ఒక ఎకరా గాని రెండు ఎకరాల గాని పాసుపుస్తకాలు చేయించుకోవడానికి అవకాశం వుంటుందని పేర్కొన్నారు. అధికారులకు తాము సాగుచేసుకుంటున్న బంజరు భూముల వివరాల దరఖాస్తులను అందచేశారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచు శంకర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, విఆర్‌ఒ మోదిన్‌బాష, ఎంపిటిసి నారాయణస్వామి, విలేజ్ సర్వేయర్ రమేష్, రైతులు, పాల్గొన్నారు.

# విజిలెన్స్ దాడుల్లో 480 బస్తాల చౌక బియ్యం పట్టి వేత



బియ్యంలోడును స్వాధీనం చేసుకున్న పోలీసులు

**మడకశిర టౌన్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

పావగడ నుంచి మడకశిర మీదుగా తుమకూరుకు వెళ్తున్న ప్రభుత్వ చౌకబియ్యం లారీని విజిలెన్స్ అధికారులు సోమవారంరాత్రి పక్కా సమాచారంతో పావగడ రోడ్డు ఆర్‌టిసి డిపో వద్ద పట్టుకున్నారు. సరిహద్దు ప్రాంతాలైన మడకశిర కళ్యాణదుర్గం దొడ్డం, హిందూపురం, తదితర ప్రాంతాల నుంచి చౌకబియ్యం యదేచ్ఛగా కర్ణాటకకు తరలుతున్న నేపథ్యంలో విజిలెన్స్ సీఐ రామారావుతోపాటు డిప్యూటీ తహశీల్దారు బాలాంజినేయులు, విఆర్‌ఓ నరేష్, వార్డు అడ్మినిస్టేషన్ సెక్రెటరీ మల్లికార్జున, జయరాం తదితర అధికారులు పాల్గొని 240 క్వింటాళ్ల చౌకబియ్యాన్ని స్వాధీనం చేసుకుని స్థానిక సివిల్ సప్లై అధికారులకు అప్పగించారు.

# వైఎస్ఆర్ రైతుభరోసా కొరకు దరఖాస్తు చేసుకోండి

**పుట్లూరు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

వైఎస్ఆర్ రైతు భరోసా పథకానికి సంబంధించి కొత్తగా పాసుపుస్తకాలు పొందిన రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయాధికారి కాత్యాయిని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎఓ మాట్లాడుతూ గతంలో రైతు భరోసా డబ్బులు జమ కాకపోయినా, కొత్తగా పాసుపుస్తకాలు పొందిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతేకాకుండా పిఎం కిసాన్ యోజనా పథకానికి సంబంధించి ఈకెవైసి త్వరగా చేయించుకోవాలని ఎఓ తెలిపారు.

# ఘనంగా జె.సి పవన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు



కేక్ కట్‌చేస్తున్న దృశ్యం

**తాడిపత్రిటౌన్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

పట్టణంలోని భగత్‌సింగ్‌నగర్‌లో వున్న నిరాశ్రయుల వసతి గృహంలో మంగళవారం 30వవార్డు కౌన్సిలర్ కొత్తపల్లి మల్లికార్జున ఆధ్వర్యంలో జె.సి పవన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం వసతిగృహంలోని నిరాశ్రయులకు భోజనం ఏర్పాటు చేశారు.

# పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

**యాడికి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**



తల్లులకు పౌష్టికాహారంపై వివరిస్తున్న దృశ్యం

గర్భవతులు, బాలింతలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యంతో వుంటారని అంగన్‌వాడి టీచర్ మహాలక్ష్మి తెలిపారు. యాడికి నెంబర్–4 అంగన్‌వాడి కేంద్రంలో పౌష్టికాహార వారోత్సవాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ర కాల ఉత్పత్తులను ప్రదర్శనకు వుంచారు. వీటిని తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య లాభాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడిటీచర్లు మహాలక్ష్మి, గీత, సరస్వతి, మల్లీశ్వరి, కుమారి, ఆదిలక్ష్మి, ఆనిమేటర్ అరుణ, తల్లులు పాల్గొన్నారు.

# ఈవ్‌టీజింగ్‌పై ప్రత్యేక నిఘా

**యాడికి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**



వివరాలు సేకరిస్తున్న మహిళా పోలీసు

కళాశాల, హైస్కూల్ వద్ద విద్యార్థులకు ఈవ్‌టీజింగ్ జరగకుండా యాడికి పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. పట్టణంలోని జె.సి దివాకర్‌రెడ్డి ప్రైవేటు కళాశాల, ప్రభుత్వ హైస్కూల్‌కు మధ్య కోన రోడ్డు ప్రధాన కూడలిగా వుంది. గతంలో ఇక్కడ పలుమార్లు ఈవ్‌టీజింగ్, విద్యార్థినిల పట్ల అసభ్యకరంగా చేయడం జరిగాయి. దీంతో ఇటువంటి వాటికి చెక్ పెట్టేందుకు ఎస్ఐ వెంకటేశ్వరులు ప్రత్యేక నిఘా వుంచారు. కూడలిలో ఏకంగా నాలుగు సిసి కెమెరాలను ఏర్పాటు చేశారు. కళాశాలకు రాకపోకల సమయంలో ఒక విద్యార్థిని మరే ఇతర విద్యార్థితో మాట్లాడితే అక్కడే కాపుకాచి ప్రత్యేకంగా వుంటున్న మహిళా పోలీసు వారి వివరాలు తెలుసుకోవడం జరుగుతోంది. ఇతర కారణాలు చెబితే మాత్రం అదుపులోకి తీసుకోవడం, అనుమానం వస్తే అక్కడి నుండే తల్లిదండ్రులతో మాట్లాడించడం చేస్తున్నారు. దీంతో మఫ్టీలో వుంటున్న మహిళా పోలీసు లక్ష్మినారాయణమ్మ చేస్తున్న నిఘా విభాగంతో పోలీసులకు కొంత మంది తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలియచేస్తున్నారు.

# వైఎస్ఆర్ బీమా నగదు పంపిణీ

**యాడికి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**



బాధితురాలికి నగదు అందచేస్తున్న సర్పంచు రుక్మనందరెడ్డి

మండలంలోని నగరూరు గ్రామానికి చెందిన లక్కు రామాంజినమ్మకు వైఎస్ఆర్ బీమా కింద మంజూరైన లక్ష రూపాయల నగదును గ్రామ సర్పంచు రుక్మనంద రెడ్డి మంగళవారం అంద చేశారు. రామాంజినేయులు అనే వ్యక్తి ఈ ఏడాది జనవరి 20వతేదీన కిడ్నీ వ్యాధితో మృతి చెందడం జరిగింది. దీంతో వైఎస్ఆర్ బీమా కింద లక్ష రూపాయలు మంజూరైంది. ఈ మొత్తాన్ని సచివాలయంలో కార్యదర్శి వసుంధర ఆధ్వర్యంలో సర్పంచు రుక్మనందరెడ్డి బాధితురాలికి అందచేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వసుంధర, వెల్‌ఫేర్ అమర్ నాథ్‌రెడ్డి, డిజిటల్ అసిస్టెంట్ బాలకృష్ణ, రేవతి, తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో బిజెపి ప్రజాపోరు యాత్ర



మాట్లాడుతున్న బిజెపి నాయకులు

**పుట్లూరు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

వైసిపి ప్రభుత్వం వైఫల్యాలను ఎండగడుగూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియచేయాలన్న పిలుపు మేరకు భారతీయ జనతాపార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని పుట్లూరు, తక్కళ్లపల్లి, ఎస్.గూడూరు, చింతకుంట, కడవకల్లు, రామలింగాయపల్లి, మడ్డిపల్లి, వెల్లుట్ల, తదితర గ్రామాల్లో నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా రూట్‌మ్యాప్ ప్రణాళిక సిద్ధం చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు కుందు శ్రీనివాసులురెడ్డి, ఒబిసి మోర్చా మండల అధ్యక్షులు రాగేని రామాంజియాదవ్, ఎస్‌సి మోర్చా మండల అధ్యక్షులు రామ్మోహన్, కిసాన్‌మోర్చా ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకటస్వామినాయుడు, జిల్లా కిసాన్ మోర్చా జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్‌రెడ్డి, నియోజరవర్గం యాత్ర ఇన్‌చార్జ్ డాక్టర్ కోనంకి శ్రీధర్, కో ఆర్డినేటర్ సాకే శివశంకర్, ఎస్‌సి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజా, ఒసిబి మోర్చా జిల్లా కార్యదర్శి గంగాధర్, వడ్డె రాజులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేడు ఎమ్మెల్యే, సిఇఒ రాక

**యల్లనూరు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

మండలంలోని 85 నిట్టూరు, మేడికుర్తి గ్రామాల్లో బుధవారం నిర్వహించనున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, రాష్ట్ర విద్య సంస్కరణల కమిటీ పర్యవేక్షణ సిఇఒ ఆలూరు సాంబశివారెడ్డిలు హాజరవుతారని సర్పంచులు శారద, ప్రభాకర్‌రెడ్డిలు తెలిపారు. కావునా సర్పంచులు, ఎంపిటిసిలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రతి ఒక్కరు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. 85 నిట్టూరు గ్రామలో రైతు భరోసా కేంద్రం, వైఎస్ఆర్ విలేజ్ క్లీనిక్స్ ప్రారంభిస్తారని వారు తెలిపారు.

# చట్టాన్ని అతిక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదు - సిఐ



గ్రామస్తులతో మాట్లాడుతున్న సిఐ

**యల్లనూరు, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

చట్టాన్ని అతిక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని రూరల్ సిఐ వేణుగోపాల్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బొప్పేపల్లి గ్రామంలో నాకాబంది నిర్వహించారు. ముందుగా పాతనేరస్తులు, ఫ్యాక్షన్ నేపథ్యంలో వున్న అనుమానితుల ఇళ్లలో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సిఐ గ్రామస్తులతో మాట్లాడుతూ ఫ్యాక్షన్ జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. చిన్నచిన్న సమస్యలకు గొడవలు పడడం, గ్రూపు రాజకీయాలు చేయడం చేయరాదన్నారు. ఏమైనా సమస్యలు వుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాల జోలికి వెళ్లకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. అలా కాకుండా చట్టాన్ని అతిక్రమిస్తే తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇవ్వడం జరుగుతుందని సిఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు ధోనివెంకటరవికిరణ్, గురుశంకర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# పెన్నానదిలో గల్లంతైన వారిలో ఒకరి మృతదేహం లభ్యం



మృతదేహం లభ్యమైన దృశ్యం

**తాడిపత్రిటౌన్, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**

పట్టణ సమీపంలోని శివాలయం వెనుక పెన్నానదిలో చేపలు పట్టేందుకు వెళ్లిన తాడిపత్రికి చెందిన లోకేష్, తలారిచెరువు నరేష్ అనే ఇరువురు నీటిగుంటలో పడి గల్లంతైన విషయం తెలిసిందే. దీంతో పోలీసులు, ఫైర్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టారు. వీరిలో ఒకరి మృతదేహం మండలంలోని సజ్జలదిన్నె వద్ద లభ్యమైంది. మరొకరి మృతదేహం లభ్యం కావాల్సి వుంది.

# సచివాలయ, వాలెంటీర్ వ్యవస్థ పనితీరు దారుణం..

**– పందిపర్తిలో విఆర్‌ఓ తీరుపై సర్పంచుల ఆగ్రహం**

**– ఎంపిపి గంగమ్మ, వెంకటరత్నం**

**సోమందేపల్లి, సెప్టెంబర్ 6 ప్రభాతవార్త**



సర్వసభ్య సమావేశంలో ఆగ్రహం వెలిబుచ్చుతున్న ఎంపిపి గంగమ్మ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అన్ని వర్గాలకు సముచిత రీతిలో సంక్షేమ ఫలాలనుఅ ందించాలన్న ససంకల్పంతో నెలకొల్పిన సచివాలయ, వాలెంటరీ వ్యవస్థ పనితీరు సోమందేపల్లి మండలంలో దారుణంగా ఉందని ఎంపిపి గంగమ్మ వెంకటరత్నం ఆగ్రహం వెలిబుచ్చారు. మంగళవారం ఎంపిడిఓ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభకు ఎంపిపి అధ్యక్షత వహించారు. ఈ సంద ర్భంగా సబికులను ఉద్దేశించి ఎంపిపి మాట్లాడుతూ.. మేజర్ పంచాయితీతోపాటు పలు గ్రామాల్లో కొంత



పందిపర్తి విఆర్‌ఓ తీరుపై సమావేశంలో నేలపై కూర్చుని నిరసన తెలుపుతున్న సర్పంచుల బృందం

మంది వాలెంటీర్ల పనితీరు వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని, పనితీరు సక్రమంగా లేదని పద్దతులు మార్చుకోవాలన్నారు. అదే విధంగా సచివాలయ ఉద్యోగస్తులు తామేదో కలెక్టరు ,, ఎస్పీలు అయినట్లు భ్రమలు పడుతూ సచివాలయానికి వచ్చే లబ్దిదారుల పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తూ పలు సందర్భాలలో పలు సంక్షేమ పథకాల లబ్ది వారికి అందకుండా పోవడానికి ప్రత్యక్షంగా కారణం కావడం గమనార్హం అన్నారు. ముఖ్యంగా వాలెంటరీ వ్యవస్థ పనితీరు సక్రమంగా లేదని ప్రతి ఇంటికీ లబ్ది చేకూర్చాల్సిన లబ్దిదారుల విషయంలో అసమానతలు పాటిస్తూ కేవలం నెల మొదటి రోజు పెన్షన్ల పంపిణీకి పరిమితం కావడం బాధ్యతా రాహిత్యం అన్నారు. వ్యవస్థ పనితీరు మార్చుకోకపోతే మండలంలో వైకాపా పరిస్థితి ఇబ్బందికరంగా మారుతుందని, భవిష్యత్తులో ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడగడానికి ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. అనంతరం రెవెన్యూ శాఖపై సమీక్షలో తహశీల్దారు గైర్హాజరు కావడంతో జూనియర్ అసిస్టెంట్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచులు అంజినాయక్, మండ్లి కిష్టప్ప, పరందామలు మాట్లాడుతూ.. తహశీల్దారు పనితీరు సక్రమంగా లేదన్నారు. కార్యాలయానికి వెళ్లే వారి పట్ల నిరంకుశంగా ప్రవర్తిస్తూ చిన్న చిన్న పనులు కూడా చేయడానికి రోజుల తరబడి పనిచేస్తున్నారన్నారు. అంతేకాకుండా పాసు పుస్తకాల విషయంలో నెలల తరబడి లబ్దిదారులకు అందడం లేదన్నారు. అంతేకాకుండా సచివాలయ వ్యవస్థలో 13 సచివాలయాలకుగాను ఐదు సచివాలయాల్లో విఆర్‌ఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, సిబ్బంది అందుబాటులో లేక పోవడంతో పలు గ్రామల్లో అభివృద్ధి పనులు కుంటుపడ్డాయన్నారు. ముఖ్యంగా రేషన్ కార్డుల సమస్య మండలంలో తీవ్రంగా ఉందన్నారు. అనంతరం పందిపర్తి సర్పంచుపై విఆర్‌ఓ ఇటీవల దుర్భాషలాడిన వైనాన్ని పలువురు సర్పంచులు ప్రశ్నిస్తూ సమావేశంలో నేలపై కూర్చుని నిరసన తెలిపారు. విఆర్‌ఓ పనితీరు సక్రమంగా లేదని వేలకు సరిగా రాదని, ప్రశ్నించిన విషయాలపై దొంకతిరుగుడు సమాధానాలు చెబుతూ సర్పంచు పట్ల అగౌరవంగా ప్రవర్తిస్తున్న వైనంపై ఆగ్రహం వెలిబుచ్చారు. అనంతరం హౌసింగ్ అధికారి నారాయణరెడ్డి మాట్లాడుతుండగా పలువురు ఎంపిటిసిలు, సర్పంచులు అడ్డు తగిలారు. జగనన్న కాలనీకు ఇసుక సమస్య తీవ్రంగా ఉందని, ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన జరుగుతున్నాయని, అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. దీనికి సమాధానంగా ఏఈ నారాయణరెడ్డి మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా ఇసుక రీచ్‌లు లేక పోవడంతో పరిస్థితి తీవ్రంగా మారిందని, కర్ణాటక ప్రాంతాలలో ఉన్న ఇసుక రీచ్‌ల నుంచి తోలడానికి నీటి సమస్య అధికమైందని, ప్రస్తుత వర్షాకాలంలో వాగులు, వంకలు, చెరువులు, కుంటల నీటితో నిండి పోవడంతో సమస్య తీవ్రంగా మారిందని, ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అనంతరం పలు శాఖల అధికారులు తమ పరిధిలోని విధి విధానలు, సమస్యలను ఏకరువు పెట్టగా ఎంపిడిఓ, ఎంపిపిలు సావదానంగా వాటికి పరిష్కార మార్గాలు చూపుతూ రాబోవు సర్వసభ్య సమావేశం నాటికి మండల పరిధిలో సమస్యలు లేకుండా చూస్తామని, పలు శాఖల అధికారుల పనితీరును పర్యవేక్షిస్తోందని, నిరంతరం నిఘా పెడతామని సభ్యులకు హామీలు ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు శాఖల అధికారులు, పలు గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.

ఆట



# యుఎస్ ఓపెన్‌లో రఫెల్ నాదల్ ఓటమి

### ఫ్రాన్సిస్ టియఫో చేతిలో పరాజయం

**సిడ్నీ:** యుఎస్ ఓపెన్2022లో సంచలనం నమోదయింది. 22 గ్రాండ్‌స్లామ్స్ విజేత స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్‌కు చుక్కెదురయింది. కెరీర్‌లో 23వ గ్రాండ్‌స్లామ్‌కోసం బరిలోకి దిగిన ఈప్రపంచరెండో ర్యాంకర్‌కు నాలుగోరౌండ్‌లో అనూహ్య ఓటమి ఎదురయింది. మంగళవారం జరిగిన పురుషుల ప్రీక్వార్టర్స్‌లో రఫెల్ నాదల్ 4:6, 6:4, 4:6, 3:6 తేడాతో అమెరికాకు చెందిన ఫ్రాన్సిస్ టియఫో చేతిలో పరాజయం పాలయ్యాడు. ఈ ఏడాది రుసగా రెండు గ్రాండ్‌స్లామ్స్ గెలిచి జోరుమీదున్న నాదల్‌కు ప్రధాన టోర్నీల్లో ఇదే తొలి ఓటమి. పేవమైన సర్వీసులతో పాటు అనవసర తప్పిదాలతో నాదల్‌మూల్యం చెల్లించాడు. తొలిసెట్‌నే కోల్పోయిన నాదల్ రెండోసెట్‌గెలిచి సమంచేసాడు. కానీ మూడోసెట్‌లోప్రత్యర్థిజోరును కట్టడిచేయలేకపోయాడు. దాంతో ఐదోసారి నాదల్‌సర్వీస్‌బ్రేక్‌చేసిన టియాఫో తన కెరీర్‌లో అతిపెద్ద విజయం సాధించాడు. వయసుమీదపడి కెరీర్ చివరిలో ఉన్న నాదల్ తిరిగి వచ్చే ఏడాది జరిగే ఆసీస్ ఓపెన్‌వరకూ ఉంటాడా అన్నది అనుమానమే. వరుసగాయాల బారినపడుతున్న నాదల్‌వరీరం కూడా అందుకు సహకరించడం లేదు. ఇక తన ఓటమిపై స్పందించిననాదల్ స్థాయిక తగ్గప్రదర్శన ఇవ్వలేకపోయానన్నాడు. తన ఓటమికి సాకులు వెదకాలనుకోవడం లేదన్నాడు. ప్రత్యర్థి తనకంటేమెరుగ్గా ఆడి విజయంసాధించాడన్నాడు. యుఎస్ ఓపెన్‌గెలిచి కెరీర్‌లో సెరెనా విలియమ్స్ 23 గ్రాండ్‌శ్లామ్‌లు సాధించిన ఆమెతో పాటుగా ఉండాలని భావించినా నాదల్‌కల కలగానే మిగిలిపోయింది. నాదల్‌పై విజయం సాధించిన డియఫో ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యాడు. ఈ విజయానికి తన కళ్లల్లోనీళ్లు తిరుగుతున్నాయని, నేను ఇప్పటికీ నమ్మలేకపోతున్నానని, నాదల్‌ను నేను ఓడించానన్న విషయం చూస్తే నాకెరీర్‌లోనే ఇది తనకు అద్భుతమైన మ్యాచ్ అని భావోద్వేగానికి గురయ్యాడు.

# భారత్‌పై లంక విజయం

### ఫైనల్స్ అవకాశాలు సంక్లిష్టమే

### ఆరు వికెట్ల తేడాతో శ్రీలంక విక్టరీ



**దుబాయి:** పాకిస్తాన్‌తో జరిగిన ఉత్కంఠభరితమైన మ్యాచ్‌తరహాలోనే మంగళవారం భారత్ శ్రీలంక జట్లమధ్య జరిగిన మ్యాచ్ తీవ్ర ఉత్కంఠభరితంగా సాగింది. చిట్టచివరి ఓవర్‌లో మూడు బంతుల్లో మూడు పరుగులు అవసరమైన శ్రీలంక జట్టుకు ఒకేసారి బౌండరీసాధించడంతో మొత్తం లక్ష్యం ఛేదించింది. 195.5 ఓవర్లలో ఒక బంతి మిగిలి ఉండగానే నాలుగు వికెట్ల నష్టానికి 174 పరుగులుచేసి భారత్‌పై ఆరు వికెట్ల తేడాతో విక్టరీ నమోదుచేసింది. ఈ ఓటమితో ఇపుడు భారత్ భవిష్యత్తు అగమ్యగోచరంగా తయారయింది. చివరి ఓవర్‌లో దసున్ షనక, భానుక రాజపక్షలు జట్టును విజయతీరాలకు చేర్చారు. 18 బంతుల్లో 33 పరుగులుచేసిన దసున్‌శనక నాలుగు బౌండరీలు, ఒక సిక్స్‌కూడా సాధించాడు. అదేక్రమంలో భానుక రాజపక్ష 17 బంతుల్లో 25 పరుగులుచేసాడు. రెండు సిక్స్‌లు కూడా ఆయన ఖాతాలో వేసుకున్నాడు. ముందు బ్యాటింగ్‌కు దిగిన భారత్ జట్టు 8 వికెట్లనష్టానికి 173 పరుగులుచేసి శ్రీలంకకు 174 పరుగుల లక్ష్యం విధించింది. ఈ మ్యాచ్‌లోకూడా బౌలింగ్ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. భారత్ బౌలర్ల ధాటికి శ్రీలంక బ్యాటర్లు చెదిరిపోతారనుకున్న ఫాన్స్‌కు భారత్ జట్టు నిరాశనే మిగిల్చింది. బౌలర్లు అర్షదీప్‌సింగ్, భువనేశ్వర్‌కుమార్‌లు తమ ప్రతిభకు పదునుపెట్టలేదన్న టాక్ వినిపించింది. శ్రీలంక ఓపెనర్లు నిశాంక 52 పరుగులు, కుశాల్ మెండిస్ 57 పరుగులుచేసి జట్టుస్కోరును ఓపెనర్లే సెంచరీ దాటించేసారు. కానీ ఒకే ఓవర్‌లో నిశాంకతోపాటు అసలంకను కూడా చాహల్ ఔట్‌చేసాడు. 110 సోకరువద్ద కుశాల్‌మెండిస్‌ను బోల్తాకొట్టించాడు. చివరిలో భానుక రాజపక్సె 25 పరుగులుచేసి నాటౌట్‌గా నిలిచాడు. దసున్‌షనక 33 పరుగులుచేసాడు. ఒక్క బంతి మిగిలి ఉండగానే నాలుగు వికెట్లనష్టానికి 174 పరుగులుచేసి జట్టును గెలిపించారు. కాగా ఈ మ్యాచ్‌లో చివరి ఓవర్‌లో శ్రీలంక విజయానికి ఏడు పరుగులు అవసరం అయితే అర్షదీప్‌సింగ్ వరుస యార్కర్లతో ఐదో బంతివరకూ మ్యాచ్‌ను తీసుకెళ్లాడు. డూ ఆర్ డై అన్నట్లు సాగిన ఈమ్యాచ్‌లో ముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కుదిగిన భారత్‌జట్టులోకేవలం కెప్టెన్ రోహిత్‌శర్మ ఒక్కడే రాణించాడు. 41 బంతేలెకలపూ 72 పరుగులుచేసాడు. ఐదుఫోర్లు, నాలుగు సిక్స్‌లు సైతం తన ఖాతాలో వేసుకున్నాడు. రోహిత్‌కు తోడుగా సూర్యకుమార్ యాదవ్ 29 బంతుల్లో 34 పరుగులుచేసాడు. చివరిలో రవిచంద్రన్ అశ్విన్ ఏడు బంతుల్లో 15పరుగులుచేసి నాటౌట్‌గా నిలిచాడు. కొంతవరకూ భారత్‌మెరుగైన స్కోరునే రాబట్టింది. ఓపెనర్లుగా రోహిత్‌శర్మ, కెఎల్‌రాహుల్‌లు వచ్చినా ఆరుపరుగులకే రాహుల్ ఔట్ అయ్యాడు. ఎల్బీగా వెనుదిరిగాడు. విరాట్‌కోహ్లీని మధుశంక ఒక్కపరుగు చేయనీయకుండానే క్లీన్‌బౌల్డ్‌చేసాడు. దీనితో 13 పరుగులకే భారత్‌రెండు వికెట్లునష్టపోయింది. రోహిత్, సూర్యకుమార్‌లు ఇరువురూ కలిసి జట్టుకు 97 పరుగుల భాగస్వామ్యం ఇచ్చారు. అక్కడినుంచే భారత్ గాడితప్పింది. శ్రీలంక కెప్టెన్ దాసున్ షనక సూర్యకుమార్‌యాదవ్‌ను పెవిలియన్‌కు చేర్చాడు. ఒకదశలో భారత్ 200 పరుగుల మార్కు అందుకోగలదని భావించారు. ఇద్దరూ ఔట్ అయిన తర్వాత భారత్ ఇన్నింగ్స్ మొత్తం కుప్పకూలింది. పాండ్యా 17, రిషబ్‌పంత్ 17,. దీపక్ హుడా మూడు పరుగులతో ఘోరంగా విఫలం అయ్యారు. పంత్ ఆరంభంలో మూడుఫోర్లుకొట్టి టచ్‌లోకి వచ్చినా భారీ షాట్‌యత్నించి పెవిలియన్‌కు చేరాడు. ఇక చివరిలో రవిచంద్రన్ అశ్విన్ కొన్ని షాట్లు ఆడటంతో భారత్ 173 పరుగులుచేసింది. ఫైనల్‌కు చేరాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో భారత్ ఓటమి పాలయింది. శ్రీలంక బౌలర్లలో దిల్షాన్ మధుశంక మూడు వికెట్లు తీయగా దసున్‌షనక చమిక కరుణరత్నెలు చెరో రెండు, మహీష్ థీక్షణ ఒక వికెట్ తీసారు. ఇక ఆసియాకప్ ఫైనల్‌రేసునుంచి భారత్ జట్టు దాదాపుగా నిష్క్రమించినట్లేనని చెప్పాలి. సూపర్‌ఫోర్‌లో వరుసగా పాకిస్థాన్, శ్రీలంకచేతిలో ఓడిన టీమిండియా ఇక ఆఫ్ఘనిస్థాన్‌తోమాత్రమే మ్యాచ్ ఆడాల్సి ఉంది.

## లంకమ్యాచ్‌కు ముందు కోహ్లీ తికమకపోస్ట్!

**దుబాయి:** ఆసియాకప్‌కు ముందు ఫామ్‌లో లేని కోహ్లీటోర్నీలో మాత్రం దుమ్మురేపుతున్నాడు. వరుసగా రెండు అర్థశతకాలతో కమ్‌బ్యాక్ ఇచ్చినట్లే కనిపిస్తున్న కోహ్లీప్రస్తుతం టీమిండియా తరపునలీడింగ్‌రన్ స్కోరర్‌గా ఉన్నాడు. అయితే పాక్‌తో మ్యాచ్ ఓటమి అనంతరం మీడియాతోమాట్లాడుతూ పలు ఆసక్తికర వ్యాఖ్యలుచేసాడు. తాను కెప్టెన్సీ నుంచి పక్కకు తప్పుకున్నపుడు ధోనీ మినహా ఇతరులెవ్వరూ మెసేజ్‌చేయలేదని, ధోనితో తనకున్న ప్రత్యేక అనుబంధం వల్లనే ఇదిజరిగిందని అన్నాడు. కోహ్లీ వ్యాఖ్యలు దుమారంరేపాయి. బిసిసిఐని టార్గెట్‌చేస్తూ కోహ్లీ ఈవ్యాఖ్యలుచేశాడని కొందరు వెల్లడించారు. అయితే ఆతని వ్యాఖ్యలను కొందరు సమర్థిస్తే మరికొందరు విమర్శించారు. ఆ విమర్శించినవారిలో మాజీ క్రికెట్లు కూడా ఉన్నారు. ఇంకా ఏంమెసేజ్‌కావాలి అంటూ గవాస్కర్ కోహ్లీపై ధ్వజమెత్తాడు. అయితే ఈసమస్య ముగిసిపోకముందే కోహ్లీ మంగళవారం లంకతో మ్యాచ్‌కు ముందు తన ఇన్‌స్టావేదికగా మరో పోస్టుచేసాడు. నువ్వు సంతోషంగా ఉన్నపుడు నీపక్కనున్నవాళ్లలో ఎవరు సంతోషించారో, నువు బాధలో ఉన్నసమయంలో నీబాధను ఎవరైతే పంచుకున్నారో వాళ్లకుమాత్రమే నీ గుండెల్లో పదిలమైన స్థానం ఉంటుందంటూ పేర్కొన్నాడు. కోహ్లీ ఎవరిని ఉద్దేశించి ఈపోస్టుచేసాడో అర్థం కాలేదంటూ ఫాన్స్ తెగ తికమకపడ్డారు. భిన్నరీతుల్లో స్పందిస్తూ పోస్టులు వెల్లువెత్తించారు.





## పెళ్లితో ఒక్కటి కానున్న ప్రేమికులు

### రాహుల్ అతియాల వివాహానికి ఓకే

**ముంబయి:** టీమిండియా క్రికెటర్‌కెఎల్‌రాహుల్ త్వరలోనేతన ప్రియురాలు అతియాశెట్టి ని పెళ్లాడుతున్నాడు. రాహుల్ అతియాలు ఎక్కడ పెళ్లాడాలన్న అంశంపై ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఖండాలాలో సునీల్‌శెట్టికి చెందిన బంగ్లా జహాన్‌లో వీరిద్దరూ పెళ్లిబంధంతో ఒక్కటి కానున్నారని తెలుస్తోంది. స్టార్‌హోటల్‌లో వీలున్నప్పటికీ వీరిద్దరూ సొంత బంగ్లాలోనే వివాహంచేసుకోవాలనినిర్ణయించుకున్నట్లున్నారు. బాలివుడ్ నటుడు సునీల్‌శెట్టి కుమార్తె అయిన అతియాశెట్టి 2015లో హీరోసినిమాద్వారా బాలివుడ్‌లోకి వచ్చింది. మూడేళ్లకుపైగా రాహుల్‌తో ఆమె డేటింగ్‌చేస్తున్నారు. అతియాపుట్టినరోజు సందర్భంగా రాహుల్ తన అనుబంధాన్ని ఇన్‌స్టాద్వారా అధికారికంగా ప్రకటించాడు. రాహుల్ అతియాలుప్రస్తుతం బాంద్రా అపార్టుమెంట్‌లో కలిసి ఉంటున్నారు. రాహుల్‌వర్క్ షెడ్యూలుపరంగా స్పష్టత వచ్చాక పెళ్లి తేదీని ఫిక్స్‌చేసే అవకాశం ఉంది. ప్రస్తుతం ఆసియాకప్ జరుగుతుండగా తర్వాత ప్రపంచకప్ దక్షిణాఫ్రికా టూర్ ఆస్ట్రేలియా టూర్‌లున్నాయి. అయితే డిసెంబరుచివరివారంనుంచి జనవరి తొలివారం వరకూ ఎలాంటిపనులు పెట్టుకోవద్దని రాహుల్ అతియాలు తమ బంధువులు సన్నిహితులకు చెప్పారని తెలుస్తోంది.

# క్రికెట్ అన్నిఫార్మాట్లకు మిస్టర్ ఐపిఎల్ గుడ్‌బై!



**ముంబయి:** భారత క్రికెట్‌జట్టు సీనియర్‌ప్లేయర్ మిస్టర్ ఐపిఎల్‌గా గుర్తింపు పొందిన సురేష్ రైనా సంచలననిర్ణయం ప్రకటించాడు. క్రికెట్‌కు మొత్తంగా వీడ్కోలు చెప్పాడు. అన్ని ఫార్మాట్లక్రికెట్‌నుంచి తప్పుకుంటున్నట్లు వెల్లడించాడు. తన అధికారిక మైక్రో బ్లాగింగ్ ప్లాట్‌ఫామ్ ట్విట్టర్‌పై మంగళవారం ఈసమాచారం పోస్టుచేసాడు. ఐపిఎల్‌లోకూడా ఇకపై తాను ఆడటంలేదన్నాడు. ఐపిఎల్‌లో తనకు అవకాశం ఇచ్చిన సిఎస్కేకు కృతజ్ఞతలు చెప్పాడు. సచిన్ టెండూల్కర్, సౌరభ్ గంగూలీ, గౌతమ్ గంభీర్‌వంటి మాజీ క్రికెటర్లు ఆడుతున్న రోడ్‌సేఫ్టీ వరల్డ్‌సిరీస్‌కు తాను అందుబాటులో ఉంటానని సురేష్‌రైనా తేల్చిచెప్పాడు. ఈనెల 10వ తేదీ రోడ్‌సేఫ్టీ వరల్డ్‌సిరీస్ ఆరంభం అవుతుంది. దక్షిణాఫ్రికాలోజరిగే టి20 సిరీస్, శ్రీలంక యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ టోర్నమెంట్స్‌ఫ్రాంచైజీలు తనను సంప్రదిస్తున్నాయని, వాటిలో ఆడాలా వద్దా అనేది ఇంకా నిర్ణయించుకోలేదని తెలిపాడు. ఐపిఎల్‌లో సురేష్‌రైనాకు మంచి రికార్డు ఉంది. సిఎస్కెకు ఆతడుప్రాతినిధ్యం వహించాడు. 2008లో తొలిసీజన్‌నుంచి ఆడాడు. 2020లో తప్పఅన్ని సీజన్లలో ఆతడు భాగస్వామి అయ్యాడు. వివాదాస్పద కారణాలతో యుఎఇనుంచి 2020లో స్వదేశానికి తిరిగి వచ్చేసాడు. ఐపిఎల్‌కెరీర్‌లో 205 మ్యాచ్‌లు 5528 పరుగులుచేసాడు. ఒక సెంచరీ, 39 అర్థశతకాలున్నాయి. 2013 ఐపిఎల్‌సీజన్‌లో అత్యధికంగా 548 పరుగులుచేసాడు. 13 ఏళ్లకెరీర్‌లో 18 టెస్ట్, 226 వన్డే ఇంటర్నేషనల్స్, 78 టి20 ఇంటర్నేషనల్స్ ఆడాడు. వన్డేల్లో 5615, టి20 ఇంటర్నేషనల్‌లో 1605 పరుగులుచేసాడు. కొంతకాలంగా క్రికెట్‌కు దూరంగా ఉంటూ వస్తున్నాడు. ఆతడు త్వరలోనే అన్ని ఫార్మాట్లక్రికెట్‌కు గుడ్‌బై చెప్పవచ్చుంటూ వార్తలు వచ్చాయి. అందుకు అనుగుణంగానేతన నిర్ణయం ప్రకటించాడు.




## టి20 ప్రపంచకప్‌కు శక్తివంతమైన దక్షిణాఫ్రికా టీమ్

### 15 మంది సభ్యులను ప్రకటించిన క్రికెట్ సౌతాఫ్రికా బోర్డు

**జోహాన్స్‌బర్గ్:** టి20 ప్రపంచకప్ టోర్నీకి దక్షిణాఫ్రికా 15 మందితోకూడిన బలమైన జట్టునుప్రకటించింది. ఈఏడాది అక్టోబరు నవంబరునెలల్లో ఆస్ట్రేలియాలో టి20 ప్రపంచకప్ జరగనున్నది. అన్రిచ్‌నోర్జే, కగిసోరబాడ, లుంగి ఎన్‌గిడి లాంటి భయంకరమైన పేసర్లను భాగంచేసింది. స్పిన్ విభాగంలో కేశవ్‌మహారాజ్, తబ్రైజ్ షమ్సీలతో ప్రత్యర్థిజట్లను బురిడీ కొట్టించాలనిచూస్తోంది. కెప్టెన్ టెంబా బవుమా ఎడమమోచేయి గాయం కారణంగా కొన్నాళ్లపాటు జట్టుకు దూరం అయిన సంగతి తెలిసిందే. గాయం నుంచి కోలుకున్న బవుమా తిరిగి జట్టులోకి వచ్చాడు. హిట్టింగ్ కుర్రాడు ట్రిస్టన్ స్టబ్స్ టి20 వరల్డ్‌కప్‌లో చోటు దక్కించుకున్నాడు. మిడిల్ ఆర్డర్ మాస్ట్రో రాస్సి వాన్‌డర్‌దుస్సేన్ ఈ జట్టుకు దూరం అయ్యాడు. ఇంగ్లండ్‌తోజరిగిన వన్డే సిరీస్‌లో గాయపడ్డ దుస్సేన్‌కు ఆరువారాల విశ్రాంతి అవసరం కావడంతో ఆతడు జట్టులోకి రాలేదు. లెఫ్టార్మ్ పేసర్ వేన్ పార్నెల్‌ను ఎంపికచేసారు. టి20 ప్రపంచకప్‌కు ముందు భారత్‌తో టి20 సిరీస్‌ను దక్షిణాఫ్రికా ఆడుతుంది. ఇండియాలోజరిగే ఈసిరీస్‌జట్టుకు మంచి సన్నాహకం అవుతుంది. టెంబా బవుమా, క్వింటన్ డీకాక్, రీజా హెండ్రిక్స్, హెన్రిచ్ క్లాసెన్, ఐడెన్ మార్క్‌రమ్, డేవిడ్‌మిల్లర్, కేశవ్‌మహారాజ్, డ్వైన్ ప్రియోటరియస్, ట్రిస్టన్ స్టబ్స్, లుంగీ ఎన్కిగడి, అన్రిచ్‌నోర్జే, వేన్ పార్నెల్, కగిసో రబాడా, రిలీ రొసొబ్సి, తబ్రెజ్ షమ్సీ, జోర్న్ ఫోర్టుయిన్, మార్కో జాన్సెన్, ఆండిలే ఫెహ్లుక్వాయోలు జట్టులో ఉన్నారు.

# సెన్స్‌హాక్‌లో రిలయన్స్ పెట్టుబడి

**ముంబై, సెప్టెంబరు 6:** వ్యాపార దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ మరో విదేశీ సంస్థతో భారీ డీల్ కుదుర్చుకుంది. అమెరికాలోని కాలిఫోర్నియాకు చెందిన సెన్స్ హాక్‌లో 79.4శాతం మెజారిటీ వాటాను కొనుగోలు చేసింది. దీని విలువ 32 మిలియన్ డాలర్లు. సెన్స్ హాక్ ఇంక్ కంపెనీతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు ఆర్ఐఎల్ మంగళవారం ప్రకటించింది. కాలిఫోర్నియాకు చెందిన సెన్స్ హాక్, 2018లో స్థాపించబడింది. ఇది సౌరశక్తి ఉత్పత్తి పరిశ్రమకు సాఫ్ట్‌వేర్ బేస్డ్ మేనేజ్‌మెంట్ టూల్స్‌ను అందించే సంస్థ. ఆటోమేషన్‌ను ఉపయోగించడం ద్వారా సౌర ప్రాజెక్టు ఉత్పత్తిని వేగవంతం చేయడంలో సహాయపడుతుందని, ఎండ్-టు-ఎండ్ సోలార్ అసెట్ లైఫ్ సైకిల్‌ను నిర్వహించేలా నిరంతరమైన సేవలందించే సోలార్ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ను అందిస్తుందని స్టాక్ ఎక్ఛేంజీలకు రెగ్యులేటరీ ఫైలింగ్‌లో రిలయన్స్ తెలిపింది. గ్రీన్ ఎనర్జీ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చేందుకు కట్టుబడి ఉన్నాయని రిలయన్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ముఖేష్ అంబానీ తెలిపారు. 2023 నాటికి 100 జిడబ్ల్యూ సౌరశక్తిని ప్రారంభించాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలిపారు. సెన్స్ హాక్ సహకారంతో ఖర్చులను తగ్గించుకుని ఉత్పాదకతను పెంచుతామన్నారు. అలాగే రిలయన్స్ మద్దతుతో సెన్స్ హాక్ అనేక రెట్లు వృద్ధి చెందుతుందని విశ్వసిస్తున్నామని అంబానీ పేర్కొన్నారు. మరోవైపు ఈ వార్తలతో మంగళవారం రిలయన్స్ షేర్లు పుంజుకున్నాయి.




## ఇన్‌స్టాగ్రామ్‌కు 32 బిలియన్ డాలర్ల ఫైన్




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 6:** పిల్లల గోప్యత కోసం ఐర్లాండ్ రెగ్యులేటర్లు ఇన్‌స్టాగ్రామ్‌పై నందుకు ఇన్‌స్టాగ్రామ్‌కు 32 బిలియన్ డాలర్ల జరిమానా విధించింది. ఇన్‌స్టాగ్రామ్ పిల్లల ఫోన్ నంబర్‌లు, ఇ-మెయిల్ చిరునామాలకు సంబంధించిన నిబంధనలను ఉల్లంఘించిందని ఆరోపించారు. ఇది చాలా కాలంగా నడుస్తుండగా, దీనిపై ఇన్‌స్టాగ్రామ్‌కు భారీ షాక్ తగిలింది. నివేదికల ప్రకారం, కొంత మంది వ్యక్తులు ప్రొఫైల్ సందర్శనల వంటి విశ్లేషణాత్మక సాధనాలను యాక్సెస్ చేయ డానికి వ్యాపార ఖాతాలను అప్‌గ్రేడ్ చేశారని ఆరోపించారు. ఇది వారి వ్యక్తిగత డేటాలో ఎక్కువభాగాన్ని పబ్లిక్‌గా చేసింది. ఇందులో ఫోన్ నంబర్‌లు, ఇ-మెయిల్ చిరునామాలు కూడా ఉంటాయి. ఇప్పుడు ఇన్‌స్టాగ్రామ్ మాతృ సంస్థ మెటా ఈ జరిమానాపై అప్పీల్ చేసేందుకు సిద్ధమైంది. అయితే రెగ్యులేటర్లు జరిమానాలను కంపెనీ ఎదుర్కోవడం ఇది మూడో సారి. భారీ జరిమానా విధించారు. పిల్లల గోప్యత నిబంధనలను ఉల్లంఘించి

## వెన్‌కాబ్ ధరలు

Mobile No. 9849219870

| (రూ. కిలోకు) | (Rs. Per Kg) | |
|---|---|---|
| ఫామ్‌గేట్ | (Farmgate) | 106 |
| డ్రెస్డ్ | (Dressed) | 128 |
| విత్ స్కిన్ | (with skin) | 186 |
| స్కిన్‌లెస్ | (Skinless) | 211 |

# నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబై, సెప్టెంబరు 6:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం స్వల్ప నష్టాల్లో ముగిసాయి. ఉదయం ఉత్సాహంగా ప్రారంభమైన సూచీలు కాసేపటికే నష్టాల్లోకి జారుకొని ఇంట్రాడే కనిష్టాలను నమోదు చేశాయి. అక్కడ కొనుగోళ్ల మద్దతుతో కోలుకున్న సూచీలు దాదాపు చివరి గంట వరకు స్వల్ప లాభాల్లో కొనసాగాయి. చివర్లో తిరిగి అమ్మకాలు జోరందుకున్నాయి. దీంతో చివరికి సెన్సెక్స్ 48.99 పాయింట్లు క్షీణించి 59,196.99 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 10.20 పాయింట్లు పడిపోయి 17,665.80 పాయింట్ల నిలిచింది. డాలరుతో మారకంలో రూపాయి విలువ రూ.79.83 వద్ద స్థిరపడింది. ఎన్‌టిపిసి, భారతీఎయిర్‌టెల్, టాటా స్టీల్, రిలయన్స్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, డాక్టర్ రెడ్డీస్, ఐసిఐసిఐ బ్యాంకు, సన్‌ఫార్మా, హెచ్‌సిఎల్ టెక్నాలజీ వంటి షేర్లు లాభాల్లో ముగిసాయి. బజాజ్ ఫిన్‌సర్వ్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, కోటక్ మహీంద్రా బ్యాంకు, ఏసియన్ పెయింట్స్, నెస్లే ఇండియా, యాక్సిస్‌బ్యాంకు, మారుతి సుజుకి, ఐటిసి, అల్ట్రాటెక్ సిమెంట్స్, హెచ్‌డిఎఫ్‌సి వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి. డ్రీమ్ ఫోక్స్ షేర్లు మంగళవారం మార్కెట్లో లిస్టయ్యాయి. ఇష్యూ ధర రూ.326తో పోలిస్తే 56శాతం లాభంతో నమోదు కావడం విశేషం. ఇంట్రాడేలో 68శాతం పెరిగి రూ.550 వద్ద గరిష్టానికి చేరింది. చివరికి 41.84 శాతం దూసుకెళ్లి రూ.462.40 వద్ద నిలిచింది. తమిళనాడు మర్కంటైల్ బ్యాంకు ఐపిఒ షేర్లు రెండోరోజు 100 శాతం సబ్‌స్క్రైబ్ అయ్యాయి. మొత్తంగా ఇప్పటి వరకు 1.22 రెట్ల షేర్లను ఇన్వెస్టర్లు సబ్‌స్క్రైబ్ చేసుకున్నారు. దామోదర్ వ్యాలీ కార్పొరేషన్‌తో కలిసి ఎన్‌టిపిసి అనుబంధ సంస్థ ఎన్‌టిపిసి రెన్యూవబుల్ ఎనర్జీ, గ్రీన్ వ్యాలీ రిన్యూవబుల్ ఎనర్జీ అనే జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేసింది. భవిష్యత్తులో ఇది పునరుత్పాదక ఇంధన పార్కులు, ప్రాజెక్టులను ఏర్పాటు చేసి నిర్వహించనుంది.



# డీమ్యాట్ ఖాతాలు 10 కోట్లు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 6:** డీమ్యాట్ ఖాతాల సంఖ్య దేశంలో శరవేగంగా పెరిగిపోతోంది. మరింత మంది రిటైల్ ఇన్వెస్టర్లు స్టాక్ మార్కెట్లోకి ప్రవేశిస్తున్నారనేందుకు నిదర్శనంగా మొత్తం డీమ్యాట్ ఖాతాల సంఖ్య 10 కోట్లను దాటింది. ఆగస్టులో కొత్తగా 22 లక్షల డీమ్యాట్ ఖాతాలు తెరుచుకోవడంతో వీటి సంఖ్య 10.05 కోట్లకు చేరింది. మన దేశంలో డీమ్యాట్ ఖాతాలు 2020 మార్చి నాటికి 4.09 కోట్లుగానే ఉన్నాయి. అదే సమయంలో కరోనా వైరస్ మహమ్మారి రాకతో స్టాక్ మార్కెట్లు భారీగా పతనం కావడం విశేషం. స్టాక్స్ చౌకగా లభిస్తుం డడంతో పెట్టుబడులకు ఎక్కువ మంది ఇన్వెస్టర్లు ముందుకు వచ్చారు. ఫలితంగా నాటి నుంచి డీమ్యాట్ ఖాతాలు పెరుగుతూ పోతూనే ఉన్నాయి. దేశంలో డీమ్యాట్ ఖాతాలను ఆఫర్ చేసే డిపాజిటరీలు రెండే ఉన్నాయి. సిడిఎస్ఎల్, ఎన్ఎస్ డీఎల్. వీటిల్లో సిడిఎస్ఎల్ 7.16కోట్ల ఖాతాలో అతిపెద్ద సంస్థగా ఉంది. కరోనా మహమ్మారి కట్టడి నిమిత్తం విధించిన లాక్‌డౌన్‌ల సమయంలో చాలా మంది స్టాక్ మార్కెట్లపై మక్కువ పెంచుకున్నారు. ఖాళీ సమయం దొరకడం, ఇంటి నుంచి పని, బయ టకు వెళ్లేందుకు అవకాశం లేకపోవడం, ఇంటర్నెట్ డేటా చౌకగా అందుబాటులోకి రావడం, బ్రోకరేజీ ఛార్జీలు తగ్గడం వంటి అంశాలు డీమ్యాట్ ఖాతాలు పెరగడానికి దోహదం చేశాయి. కుటుంబాల్లో పొదుపు పెరిగిన నేపథ్యంలో సెక్యూరిటీ మార్కెట్లను మదుపు మార్గంగా ఎంచుకుంటున్నారనడానికి డీమ్యాట్ ఖాతాలు పెరగడం ఓ నిదర్శనం అని సిడిఎస్ఎల్ ఎండీ, సిఇఒ నెహాల్ వోరా తెలిపారు.



## వాణిజ్యం


# టాటా స్టాక్స్ దూకుడు

**ముంబై, సెప్టెంబరు 6:** దేశంలో టాటా గ్రూప్ అనేక వ్యాపారాలను నిర్వహిస్తోంది. సాధారణంగా మార్కెట్లో ఉన్న ఒక నానుడి ఏమిటంటే, ఏదైనా స్టాక్ కొంటే చాలా అది దీర్ఘకాలంలో తప్పకుండా మంచి రాబడులను అందిస్తుందని అంటారు. గత 6నెలల కాలంలో స్టాక్ మార్కెట్ హెచ్చుతగ్గులను చూస్తున్నాయి. కానీ ఈ కాలంలో టాటా గ్రూప్‌లోని కొన్ని షేర్లు మాత్రం అద్భుతమైన రాబడులను ఇచ్చాయి. టాటా పవర్ గత 6 నెలల్లో ఈ షేరు ధర 12శాతానికిపైగా పెరిగింది. ఈ కాలంలో కంపెనీ షేరు ధర రూ.216 నుంచి రూ.244 స్థాయికి చేరుకుంది. గత నెలో కంపెనీ షేర్ల ధరలు 6.90శాతం పెరిగాయి. కంపెనీ షేరు ధర రూ.341 పెరిగింది. ఈ సమయంలో కంపెనీ షేరు ధర రూ.1064 నుంచి రూ.1400 స్థాయికి చేరుకుంది. అంటే 6 నెలల్లో క్రితం ఈ స్టాక్‌లో ఇన్వెస్ట్ చేసిన పెట్టుబడిదారులకు దాదాపు 32శాతం రాబడి లభించింది. టాటా కెమికల్ లిమిటెడ్ గత కొంత కాలంగా తమ పెట్టుబడిదారులకు మంచి రాబడిని అందించాయి. అలా 6 నెలల్లో 30శాతానికిపైగా రిటర్న్స్‌ల ఇచ్చిన కంపెనీల జాబితాలో టాటా కెమికల్స్ షేర్లు కూడా నిలిచాయి. పొజిషనల్ ఇన్వెస్టర్లకు కంపెనీ 32 శాతం రాబడిని ఇచ్చింది. అదే సమయంలో కంపెనీ షేర్లు 17శాతం పెరిగాయి. టాటా మోటార్స్ గత ఆరు నెలల్లో ఈ సంస్థ షేర్లు 16.66 శాతం పెరిగాయి. కంపెనీ షేరు ధర రూ.394 నుంచి రూ.459 స్థాయికి చేరుకుంది. అయితే గత నెల రోజులుగా ఇన్వెస్టర్లకు మేలు జరగలేదు. ఈ క్రమంలో కంపెనీ షేర్లు దాదాపు 2శాతం పడిపోయాయి. టాటా కన్జూమర్ షేరు కూడా పెట్టుబడిదారులకు 25శాతం కంటే ఎక్కువ రాబడిని ఇచ్చింది. కంపెనీ షేరు ధర రూ.659 నుంచి రూ.830కి పెరిగింది.




# ఐపిఒకు వైభవ్ జ్యుయెల్లర్స్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 6:** దక్షిణాదిలో కార్యకలాపాలు సాగిస్తున్న ప్రముఖ జ్యుయెల్లరీ సంస్థ వైభవ్ జెమ్స్ అండ్ జ్యుయెల్లరీ లిమిటెడ్ త్వరలో ఐపిఒకు రానుంది. రూ.210 కోట్ల నిధులను సమీకరించేందుకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి దరఖాస్తు చేసుకుంది. ఐపిఒలో భాగంగా ప్రమోటర్ సంస్థ అయిన గ్రంధి భరత మల్లిక రత్న కుమారికి చెందిన 43 లక్షల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనున్నారు. ఐపిఒ ద్వారా సమీకరించిన మొత్తాన్ని 2023-24 ఆర్థిక సంవత్సరంలో 8 కొత్త షోరూమ్‌లు తెరిచేందుకు, వాటిలో వస్తువులు సమకూర్చుకునేందుకు ఉపయోగించనున్నట్లు డ్రాఫ్ట్ ప్రాస్పెక్టస్‌లో ఆ సంస్థ పేర్కొంది. విశాఖపట్నంలో కేంద్రంగా వ్యాపారం నిర్వహిస్తున్న వైభవ్ జ్యుయెల్లర్ సంస్థ 1994లో ప్రారంభమైంది. గ్రంధి భరత మల్లిక రత్నకుమారి, ఆమె తనయ గ్రంధి సాయి కీర్తన ప్రస్తుతం దీనికి యజమానులుగా వ్యవహరిస్తున్నారు. వైభవ్ జ్యుయెల్లర్స్ పేరిట బంగారు, వెండి, వజ్రాభరణాలను విక్రయిస్తున్నారు. 2021 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ మార్కెట్ వాటా 14 శాతంగా ఉందని టెక్నోపాక్ నివేదిక పేర్కొంది.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Plot no B11 & B12, Industrial Park, Bellary Road, Anantapur. Phone :9848996402 Mail. vaartthaatp@gmail.com, RNI No. 70088/97, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.: No.HSD/337/18-20 **Air Surcharge:** Delhi : 40 Ps.